ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



అన్నమయ్య

జిల్లా వార్తలు

5

మంగళవారం 10 డిసెంబరు 2024

సోషల్ మీడియా వల్లే విడాకుల ట్రెండ్



పాశ్చాత్య దేశాల్లో జరుగుతున్న వ్యవహారాలు, సోషల్ మీడియా తప్పుడు విధానాల వల్ల విడాకుల ట్రెండ్ ఎక్కువగా నడుస్తోంది. పెళ్లి జరిగిన కొద్దిరోజులకే కొన్ని, పెళ్లిపీటల మీదనే అనేక పెళ్లిళ్లు నిలిచిపోతున్నాయి. ఆర్భాటాలకు, ఫొటోలు, వీడియోల ఫోజులకు విలువ ఇస్తున్నారే తప్ప మాంగళ్యధారణ పవిత్రతకు విలువ ఇవ్వడం లేదు. తమ కోరికలను ఆకాశమంత ఎత్తు ఊహించుకుని వాటికి అనుగుణంగా నిజ జీవితాలు ఉండకపోవడంతో ఈ పెళ్లిళ్ల వ్యవస్థ సర్వనాశనమవుతోంది. ఇటీవల స్వయంగా జీవించే ఆర్థిక స్థోమత పెరగడం వల్ల కూడా విడాకులు పెరుగుతున్నాయి.

- సాయి స్వామి, పురోహితుడు, నారాయణనెల్లూరు, పెనగలూరు మండలం



మాంగల్యం తంతునానేనా మమజీవన హేతునా అని హిందువులు.. ఖుబుల్ హై అని ముస్లింలు.. నేను ఒప్పుకుంటున్నా అని క్రిస్టియన్లు.. వివాహ బంధంతో ఒక్కటవుతున్నారు. నిండు నూరేళ్ల జీవితానికి కలసి అడుగులు వేస్తున్నారు. మతం ఏదైనా వివాహబంధానికి ఎంతో ప్రాధాన్యం ఉంది. అయితే ఇటీవల వివాహబంధం అపహాస్యం పాలవుతోంది. చిన్నచిన్న కారణాలకే కోర్టు మెట్లెక్కుతున్నారు. విడాకులకు సిద్ధపడుతున్నారు. పెళ్లయి పట్టుమని పది రోజులు కాకముందే విడాకులు కోరడం అందరినీ ఆందోళనకు గురి చేస్తోంది.

విడాకుల ట్రెండ్





- పెళ్లిపీటలమీదే మంగళం
- తమ ఊహలకు తగిన విధంగా లేకపోవడంతో తెగిపోతున్న బంధాలు
- కోర్టులు, పోలీసుస్టేషన్ల చుట్టూ తిరుగుతున్న నూతన దంపతులు
- ఆశలు అడియాసలై తల్లడిల్లిపోతున్న తల్లిదండ్రులు



రాజంపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పెళ్లి అనే దానికి ఇటీవల అర్థం లేకుండాపోతోంది. కేవలం రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాలను తీసుకుంటే .. ఇక్కడి కోర్టులు వందల కొద్దీ విడాకుల కేసులతోనే నిండిపోతున్నాయి. 50 శాతం పెళ్లిళ్లు పట్టుమని ఏడాది కూడా నిలవడం లేదు. ప్రేమ వివాహమైనా, పెద్దలు కుదిర్చిన వివాహమైనా, పెళ్లిళ్ల పేరయ్యల ద్వారా కుదిర్చిన వివాహాలు ఏదైనా సరే.. కొనసాగడం లేదు. ఇటీవల మూడు నెలలుగా జరిగిన వ్యవహారాలను పరిశీలిస్తే ఎన్నో బాధాకరమైన అంశాలు బయట పడుతున్నాయి. తల్లిదండ్రులు అప్పులు చేసి లక్షలు పోగు చేసి తమ కుమార్తెకో లేక కుమారుడికో వివాహం చేసి బరువు దించుకుందామని కంటున్న కలలు కల్లలుగానే మిగిలిపోతున్నాయి.

గతంలో పెద్దలు ఒక పురోహితుడిని పిలిపించుకుని పెళ్లికి ముందు లగ్న తాంబూళాలు రాసుకునేవారు. ఈ లగ్న తాంబూళాల పత్రాలను వధువు, వరుడు తల్లిదండ్రులకు అందజేసి వివాహ తంతుకు సిద్ధమయ్యేవారు. ఇప్పుడు ఆ కథ మారిపోయింది. పెళ్లి కంటే ఘనంగా నిశ్చితార్థ వేడుకలే అత్యంత ఆర్భాటంగా జరుగుతున్నాయి.

చదువుకున్న వారే ఎక్కువ..

మూడు నెలలను పరిగణనలోకి తీసుకుంటే ఒక్క రాజంపేట, రైల్వేకోడూరుల్లోనే నిశ్చితార్థంలోనే వివాహ తంతుకు బ్రేక్ పడినవి అనేకం. వాళ్ల అభిరుచులకు, ఆలోచనలకు తగ్గట్టుగా ఉండకపోవడంతో నిశ్చితార్థ వేడుకలోనే.. లేదా ఈ వేడుక జరిగిన రెండు రోజులకే ఈ సంబంధం మాకొద్దు అనే వ్యవహారాలు 10 శాతం పైగా జరిగాయి. కొన్ని నిశ్చితార్థ వేడుకలు పూర్తయి లక్షలు ఖర్చు చేసి పెళ్లిళ్లను నిర్వహిస్తే పెళ్లిపీటల మీదే ఈ సంబంధం మాకొద్దు అని అక్కడికక్కడే పెళ్లిని రద్దు చేసుకుని వెళ్లిపోయినవారు అనేక మంది ఉన్నారు. ఇక పెళ్లి చేసుకున్న వారం రోజులకే మాకొద్దు ఈ సంబంధం అని ఇరువర్గాల బంధువులతోను పోలీసుస్టేషన్‌కు ఎక్కి మంగళసూత్రాన్ని వెనక్కు ఇచ్చేసి పెట్టిన పెళ్లి ఖర్చులు చెరి సగం వేసుకుని వదులుకుంటున్న సంబంధాలు కోకొల్లలు. ఈ విధంగా కాకుండా 3 నెలలో, 6 నెలలో సంసారాన్ని కొనసాగించి వరుడికి వధువు ఆలోచనలు నచ్చలేదనో.. లేక వధువుకు వరుడి అభిప్రాయాలు భిన్నంగా ఉన్నాయనో విడాకుల కోసం కోర్టుకెక్కుతున్నవారు కోకొల్లలు. ఈ విధంగా విడాకుల కోసం పోలీసుస్టేషన్ల చుట్టూ, కోర్టుల చుట్టూ తిరుగుతున్న యువతీ యువకులను.. ఈ బాధలను భరించలేక అల్లాడిపోతున్న తల్లిదండ్రులను చూసి ఎవరి మనసు అయినా చలించక మానదు. చిన్న చిన్న గొడవలకే విడాకులు తీసుకోవడం, విడాకులు తీసుకున్నవారిలో ఎక్కువగా ఉన్నత చదువులు చదివినవారే ఉండడం విశేషం.

సోషల్ మీడియా ప్రపంచంలో విహరించడంతో..

ఈ విషయమై ఓ సైకాలజిస్టు మాట్లాడుతూ.. విడాకులకు ముఖ్య కారణం పెళ్లికి ముందు అమ్మాయిలు, అబ్బాయిలు పెట్టుకున్న అంచనాలు పెళ్లి తర్వాత నెరవేరకపోవడమే అన్నారు. నేటి యువత సోషల్ మీడియా ప్రపంచంలో విహరిస్తూ నిజమైన జీవితానికి అలవాటుపడకపోవడంతో విడాకులకు కారణం అవుతోందన్నారు. ఇటీవల ఒక వరుడి తల్లిదండ్రులు తమ బంధువుల దగ్గరకు వెళ్లి తమ అబ్బాయికి వివాహం నిశ్చయం చేశామని, ముందుగా నిశ్చితార్థం వేడుక చేయాలన్నప్పుడు బంధువులంతా ఈ నిశ్చితార్థ తంతు వద్దనే వద్దని చెప్పి ఆపివేయించారట. కారణం అడిగితే లక్షలు ఖర్చు చేసి ఈ ఆర్భాటపు నిశ్చితార్థాలు, పెళ్లిళ్లు, కట్నాలు అప్పులు చేసి నిర్వహిస్తే తీరా విడాకుల పేరిట సంబంధాలు చెడిపోతున్న అంశాన్ని ప్రముఖంగా ప్రస్తావించుకున్నారంట. ఏకంగా పెళ్లికే సిద్ధమై ఆర్భాటాలకు వెళ్లకుండా గతంలో జరుగుతున్నట్లుగా సంప్రదాయ పెళ్లిళ్లను నిరాడంబరంగా చేద్దామని అనుకున్నారంట. అంటే ఈ విడాకుల ట్రెండ్‌ను చూసి తల్లిదండ్రులు ఎంత భయపడుతున్నారనే దానికి ఇది ఉదాహరణ. ఈ విషయమై యువతీ యువకులు పునరాలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సంప్రదాయాల ప్రకారం పెళ్లిళ్ల విశిష్టతను తెలుసుకుని ముందుకు సాగకపోతే ఈ పెళ్లిళ్లకే అర్థం లేకుండా పోతుంది.


పెళ్లిపీటల మీదే పటాపంచలు..



పెళ్లి పీటల మీదే పెళ్లిళ్లు పటాపంచలు అవుతున్నాయి. నేను న్యాయవాదిగా దీనిపై పరిశీలిస్తున్నా. పెళ్లయిన కొద్దిరోజులకే తమకు ఈ సంబంధం వద్దని కోర్టుకెక్కుతున్నారు. పట్టుమని పెళ్లయిన పది రోజులకే మాకు ఈ సంబంధం వద్దని కోర్టు, పోలీసుస్టేషన్ గడపలకు వచ్చేస్తున్నారు. దీనికి బలీయమైన కారణాలు ఏమీ లేవు. వారు అనుకున్న కోరికలకు అనుగుణంగా వధువు, వరుడు లేకపోవడమే ప్రధాన కారణం. ఏదేదో ఊహల్లో తేలుతూ ఉండడమే ఈ విడాకులకు కారణం. దీనివల్ల వధూవరులతో పాటు వారి తల్లిదండ్రులు, బంధువులు పోలీసుస్టేషన్ల వద్ద, కోర్టుల వద్ద పడరాని బాధలు పడుతూ అప్పులపాలై రోడ్డు పాలవుతున్నారు.

- నాగా సుధాకర్‌రెడ్డి, న్యాయవాది, రాజంపేట


వింత పోకడలు ప్రధాన కారణం..



ఇటీవల జరుగుతున్న సంఘటనలు నాలాంటి పెద్దలను ఎంతో బాధిస్తున్నాయి. గతంలో ఏదో ఒకటి రెండు కేసులు తప్ప మిగిలిన 99 శాతం పెళ్లిళ్లు నిండు నూరేళ్లు సాగేవి. ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. నాకు తెలిసిన చుట్టుపక్కల నిశ్చితార్థంలోను, పెళ్లి పీటలమీదో, పెళ్లి అయిన 10 రోజులకో, మూడు నెలలకో, ఏడాదిలోపే విడిపోయి విడాకులు తీసుకుంటున్న సంఘటనలు అనేకం ఉన్నాయి. ఇలాంటివి చూడటం నాలాంటి వారికి చాలా బాధగా ఉంది. నేను ఓ తండ్రిగా ఇతర కుటుంబీకులు ఎదుర్కొంటున్న విడాకుల బాధలు వినాలంటేనే కష్టంగా ఉంది. నేటి యువతీ యువకుల్లో కలుగుతున్న వింతపోకడలే విడాకులకు ప్రధాన కారణం.

- డాక్టర్ తోట రామయ్య,

సీనియర్ సిటిజన్, రాజంపేట




మామిడి రైతుకు తీపి కబురు

- పంటల బీమాలో మామిడికి స్థానం
- ఈనెల 15లోపు బీమా చేయించుకోవాలి

6

పంటకు రక్షణ వలయం

- వలలు, మెష్‌లు, పాత చీరలు కడుతున్న రైతులు
- వింత శబ్దాలు చేసే మైక్‌లు ఏర్పాటు





ప్రజాదర్బార్‌లో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

సమస్యలను చిత్తశుద్ధితో పరిష్కరించాలి

- భూసమస్యలపై ప్రత్యేక దృష్టి సారించండి : మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రామాపురం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అధికారులు ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. సోమవారం రామాపురం మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎక్కడా లేని విధంగా అన్నమయ్య జిల్లాలో భూసమస్యలు అధికంగా ఉన్నాయని, రెవెన్యూ అధికారులు భూసమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలన్నారు. రాబోయే ఐదు సంవత్సరాల్లో జిల్లాలో ఎవరూ కూడా భూసమస్యలతో బాధపడకూడదనే ఉద్దేశంతో ప్రతి మండలంలో నెలకొకసారి ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ఈనెల 12వ తేదీ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలల కాలం పూర్తవుతుందని, ఈ ఆరు నెలల కాలంలో చాలా వరకు భూసమస్యలకు పరిష్కారం జరిగిందని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని శాఖల కంటే రెవెన్యూ శాఖకు అధిక ప్రాధాన్యత ఉందని, ఏ పని చేయాలన్నా రెవెన్యూ శాఖపై ఆధారపడాల్సి వస్తుందన్నారు. రెవెన్యూ శాఖలో వీఆర్‌వో నుంచి ఆర్డీవో వరకు బాగా పనిచేసి ప్రజల మన్ననలు పొందాలన్నారు. రాయచోటి నియోజకవర్గంలో వర్షాభావ పరిస్థితుల వల్ల నీటి సమస్య ఏర్పడే అవకాశం ఉందని, ఇప్పటి నుంచే ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు గ్రామాలకు వెళ్లి నీటి సమస్యలను గుర్తించి అక్కడ ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. ఉపాధి హామీ పథకంలో కొంతమంది నకిలీ జాబ్‌కార్డులు సృష్టించి పేదలకు అన్యాయం చేస్తున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. అర్హులైన అందరికీ జాబ్‌కార్డులు అందించి పనిదినాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్ రామాంజనేయులు, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసులు స్వాధీనం చేసుకున్న 37 ద్విచక్ర వాహనాలు



నలుగురు అంతర్రాష్ట్ర ద్విచక్ర వాహనాల దొంగల అరెస్టు

- రూ.64 లక్షల విలువ చేసే 37 ద్విచక్ర వాహనాలు స్వాధీనం
- విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించిన అదనపు ఎస్పీ వెంకటాద్రి

7

మూగజీవాలకు అన్యాయం

- అధికారుల మాయాజాలం
- నట్టల నివారణ మందు 70 వేల గొర్రెలకు వేసినట్లు రికార్డులు
- క్యాంప్‌లు ఏర్పాటు చేయలేదంటున్న రైతులు

6



ప్రజల దగ్గర నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ శ్రీధర్



ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించండి

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి(కలెక్టరేట్), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో సోమవారం కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన ప్రజల సమస్యలను అత్యంత ప్రాధాన్యతతో పరిష్కరించాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం కూడా ఫిర్యాదుల పరిష్కారంపై నేరుగా పర్యవేక్షణ చేస్తోందని తెలిపారు. ప్రతి సమస్యను, ప్రజల నుంచి వచ్చే ఫీడ్ బ్యాక్‌ను ప్రభుత్వం సీరియస్‌గా పరిశీలిస్తుంది కాబట్టి అధికారులందరూ ప్రాధాన్యతగా ఫిర్యాదులను 100 శాతం పరిష్కరించాలన్నారు. సమస్యను పట్టుకొని పరిష్కారం కోసం ఎంతో ప్రయాసతో ప్రజలు అధికారుల వద్దకు వస్తారని, వారి సమస్యను సావధానంగా వినాలన్నారు. సమస్య ఏమిటి, దానిని ఎలా పరిష్కరించాలన్న విషయాలపై అధికారులకు అవగాహన ఉండాలని, చిత్తశుద్ధితో ప్రజల సమస్యలను నాణ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో జేసీ ఆదర్శ్ రాజేంద్రన్, డీఆర్‌వో మధుసూదనరావు, ఎస్‌డీసీ రామసుబ్బయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

టమోటా ధరలు పతనం

- నష్టాల బాటలో రైతులు
- 30 కిలోల బాక్సు ధర రూ.70 నుంచి 350

కురబలకోట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నిన్న మొన్నటి వరకు ఒకరకంగా ఉన్న ధరలు ఒక్కసారిగా పతనమైపోయాయి. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. 30 కిలోల బాక్సు ధర రూ.70 నుంచి 350 రూపాయల వరకు పలుకుతున్నాయి. ధరలు ఇలాగే కొనసాగితే పెట్టిన పెట్టుబడులు కూడా రావని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆరుగాలం కష్టపడి సాగు చేసిన టమోటా పంటకు కనీసం గిట్టుబాటు ధరలు లేకపోవడంతో రైతన్నలు వరుస నష్టాలను చవిచూస్తున్నారు. ప్రతి ఏడాది టమోటా పంటను సాగు చేసి లాభాలు ఆర్జించవచ్చనే గంపెడాశతో ఎదురు చూస్తున్న రైతన్నలకు ఈ ఏడాది కూడా నిరాశే మిగులుతోంది. నిన్న, మొన్నటి వరకు ఆశాజనకంగా పలికిన టమోటా ధరలు ప్రస్తుతం ఒక్కసారిగా పతనమవడంతో చేసిన అప్పులు, వడ్డీలు ఎలా తీర్చాలో తెలియక కుమిలిపోతున్నారు.


జిల్లాలోని పడమటి ప్రాంత మండలాల్లో ఎక్కువ మంది రైతన్నలు టమోటా పంటను సాగు చేస్తారు. ఈ ఏడాది టమోటా పంటకు సీజన్ ప్రారంభం నుంచి ధరలు ఆశాజనకంగా ఉన్నా దాదాపుగా మిగిలిన పంటల ధరలు నిరాశాజనకంగానే ఉన్నాయి. ఎకరానికి దున్నకం, విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారక మందులు, కూలీలు, కలుపు తీయడం తదితర వాటికి సంబంధించి రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు ఖర్చు వస్తుంది. ఇదివరలో పంట దిగుబడి తక్కువగా ఉండటంతో పాటు విపరీతమైన డిమాండ్ ఉండేది. దీంతో ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు ఇక్కడకు వచ్చి కొనుగోలు చేసేవారు. 30 కిలోల టమోటా బాక్సు రూ.700 నుంచి రూ. 1500 వరకు పలికేది. కాగా ఇక్కడ టమోటాలను కొనుగోలు చేసిన వ్యాపారులు ఢిల్లీ, మహారాష్ట్ర, తమిళనాడు, ఒడిస్సా, చత్తీస్‌ఘడ్ తదితర రాష్ట్రాలకు ఎగుమతి చేసేవారు. ప్రస్తుతం ఆయా రాష్ట్రాలలో పంటను అక్కడి రైతులు పండించడంతో పాటు పంట దిగుబడి పెరగడంతో ఇక్కడి నుంచి ఎగుమతులు తగ్గాయి. దీంతో ఇక్కడ కొనే నాథుడు లేక ధరలు పతనమయ్యాయి. తమిళనాడులో తుఫాన్ కారణంగా అక్కడ పంట దెబ్బతినడంతో ఆ ప్రాంతానికి మాత్రమే ఎగుమతి అవుతున్నాయి. దీంతో మిగిలిన రాష్ట్రాల వ్యాపారులు ఇక్కడికి రాకపోవడంతో ప్రస్తుతం 30 కిలోల టమోటా బాక్సు ధర రూ.70 నుంచి రూ.350 మధ్య పలుకుతోంది. కాగా ఎవ్వరూ ఊహించని రీతిలో ఒక్కసారిగా ధరలు పతనం కావడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ప్రభుత్వం చర్యలు తీసుకుని టమోటా రైతులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.



అంగళ్లు మార్కెట్‌కు వచ్చిన టమోటాలు

నా భూమి నాకు చూపించండి

- మాజీ సైనికుడు ఆత్మహత్యాయత్నం
- తహసీల్దార్ కార్యాలయం ఎదుట గొంతుకోసుకుని..



తహసీల్దార్ కార్యాలయం ఎదుట కత్తితో గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మాజీ సైనికుడు

మదనపల్లె అర్బన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తన భూమి రికార్డులను తొలగించారని మదనపల్లెకు చెందిన మాజీ సైనికోద్యోగి సోమవారం మదనపల్లె తహసీల్దార్ కార్యాలయం ఎదుట కత్తితో గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే ఆయనను మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. వివరాలిలా ఉన్నాయి. మదనపల్లె మండలం బసినికొండ పంచాయతీ వెంకప్పకోటలో మాజీ సైనికులు ముగ్గురికి 2007లో ప్రభుత్వం పట్టాలను మంజూరు చేసింది. ఇందులో మాజీ సైనికుడైన మదనపల్లె మండలం కురవంక గ్రామం భువనేశ్వరి ఆలయం వద్ద నివాసం ఉంటున్న రామచంద్రకు సర్వేనెంబరు 89లో 2.30 ఎకరాలను ప్రభుత్వం పట్టా మంజూరు చేసింది. దీనికి సంబంధించి తనకు వన్‌బీ, పాసుపుస్తకం, రికార్డులు అన్నీ తన పేరిటే ఉండేవన్నారు. ఏడాది క్రితం నుంచి తహసీల్దార్ కార్యాలయంలో తన పేరిట ఉన్న రికార్డులను తొలగించారని బాధితుడు తెలిపాడు. ఈ విషయమై పలుమార్లు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతూ సబ్ డివిజన్ చేసి తనకు పట్టా ఇచ్చిన భూమిని తనకు చూపాలని, అన్‌లైన్‌లో ఎక్కించాలని కోరుతున్నా అధికారులు పట్టించుకోలేదని వాపోయాడు. ఫిర్యాదు చేసినప్పుడల్లా తహసీల్దార్‌పై సర్వేయర్, సర్వేయర్‌పై తహసీల్దార్ పెట్టుకొంటూ తిప్పుతున్నారని, అధికారులు మారిపోతుండడంతో నాకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తనతో పాటు ఇద్దరికి ఇచ్చిన భూమిని వారికి పక్కా గా రికార్డు చేయించారని చెప్పారు. సైనికుడిగా వివిధ యుద్ధాలు, దేశ ఆక్రమణల పోరాటాల్లో పనిచేశానని నాకే అన్యాయం చేశారని వాపోయాడు. ఎంత చెప్పినా ఎంతో ఓపికగా తిరుగుతున్నా అధికారుల్లో చలనం లేకపోవడంతో ఇలా ఆత్మహత్యాయత్నం చేయాల్సి వచ్చిందని వాపోయాడు. కాగా కార్యాలయం ఎదుట గొంతు కోసుకోవడంతో వెంటనే అధికారులు అప్రమత్తమై ఆయనను చికిత్స నిమిత్తం మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ విషయమై పోలీసులు కేసు నమోదు చేశారు.

మాజీ సైనికుడిని పరామర్శించిన ఎమ్మెల్యే

తహసీల్దార్ కార్యాలయం ఎదుట గొంతు కోసుకుని ఆత్మహత్యకు యత్నించిన మాజీ సైనికుడు రామచంద్రను ఎమ్మెల్యే షాజహాన్ బాషా పరామర్శించారు. సోమవారం కురవంకలో రామచంద్ర నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యే ఆయన సమస్యను తెలుసుకున్నారు. మాజీ సైనికుడికి కేటాయించిన భూమి సర్వే విషయంలో అధికారులు ఆలసత్వం ప్రదర్శించడం సరికాదన్నారు. ఈ విషయమై సర్వే ఏడీతో ఫోన్‌లో మాట్లాడి రెండు రోజుల్లో మాజీ సైనికుడి భూమిని సర్వే చేయించి హద్దులు చూపాలని తెలిపారు. ప్రజలను ఎవరైనా అధికారులు వేధిస్తే టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేయాలని ఎమ్మెల్యే సూచించారు.

మామిడి రైతుకు తీపి కబురు

- పంటల బీమాలో మామిడికి స్థానం
- ఎకరాకు ప్రీమియం కింద రూ.2250
- పంట నష్టం జరిగితే ఎకరాకు రూ.45 వేల పరిహారం
- ఈనెల 15లోపు బీమా చేయించుకోవాలి



పీలేరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మామిడి రైతులకు కూటమి ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. ఎన్నో దశాబ్దాలుగా మామిడి రైతులు డిమాండ్ చేస్తున్న బీమా సదుపాయాన్ని కల్పించింది. ఈ మేరకు శనివారం మామిడి రైతులకు అనుకూలంగా నిర్ణయం తీసుకుంది. పునర్వ్యవస్థీకరించబడిన వాతావరణ ఆధారిత పంటల బీమా ఆర్‌డబ్ల్యూబీసీఐఎస్ (రీస్ట్రక్చర్డ్ వెదర్ బేస్డ్ క్రాప్ ఇన్సూరెన్స్ స్కీం)లో మామిడిని చేర్చింది. దీంతో ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో పంటను కోల్పోయే మామిడి రైతులకు గణనీయంగా ఉపశమనం లభించనుంది. కూటమి సర్కారు తీసుకున్న ఈ నిర్ణయంతో రాష్ట్రంతో పాటు జిల్లాలోని మామిడి రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

ఆర్‌డబ్ల్యూబీసీఐఎస్‌లో మామిడికి చోటు

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో లభిస్తున్న ప్రోత్సాహకాల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా మామిడి తోటల సాగు గణనీయంగా పెరిగింది. విస్తీర్ణం పెరిగి చాలామంది రైతులకు లబ్ధి చేకూరుతున్నప్పటికీ మామిడి పంటకు బీమా లేకపోవడంతో ప్రతి ఏటా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మామిడి పంటకు బీమా వర్తింపజేయాలని ఏళ్ల తరబడి రైతులు పోరాడుతున్నారు. వారి పోరాటం ఫలించి కూటమి ప్రభుత్వం వారికి అనుకూలంగా నిర్ణయం తీసుకుంది. అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ అనే కేంద్ర ప్రభుత్వ సంస్థ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో కాలానుకుణంగా వాతావరణంలో వచ్చే ప్రతికూల మార్పులతో పంట నష్టం కలిగే ఆర్థిక నష్టాల నుంచి రైతులను ఆదుకునేందుకు మన రాష్ట్రంలో ప్రస్తుత రబీ సీజన్ (2024-25)లో పునర్వ్యవస్థీకరించబడిన వాతావరణ ఆధారిత పంటల బీమా (ఆర్‌డబ్ల్యూబీసీఐఎస్) పథకాన్ని మామిడికి వర్తింపజేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్‌డబ్ల్యూబీసీఐఎస్ అమలవుతున్న జిల్లాల్లో అన్నమయ్యకు కూడా చోటు దక్కింది. దీంతో జిల్లాలో 36 వేల హెక్టార్లలో మామిడి సాగు చేస్తున్న సుమారు 20 వేల మంది రైతులకు లబ్ధి చేకూరనుంది.

ఎకరాకు రూ.2250 ప్రీమియం

ఆర్‌డబ్ల్యూబీసీఐఎస్ పథకం అమలవుతున్న 15 జిల్లాల్లో బీమా ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వం వేర్వేరుగా నిర్ణయించింది. అందులో భాగంగా అన్నమయ్య జిల్లాలోని మామిడి రైతులు ఎకరాకు రూ.2250 ప్రీమియం చెల్లించాలి. అలా ప్రీమియం చెల్లించిన రైతులకు రూ.45 వేల పరిహారం లభించే అవకాశం ఉంది. ఈనెల 15వ తేదీలోపు ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. అక్టోబరు 1, 2020 ముందు అనగా ఐదేళ్ల ముందు మామిడి తోటలు పెట్టిన వారికి మాత్రమే ఈ పథకం వర్తిస్తుంది.

బీమా అయ్యే అంశాలు, వర్తించే సమయం

ఆర్‌డబ్ల్యూబీసీఐఎస్ పథకం కోసం రైతులు ఈనెల 15వ తేదీలోపు ప్రీమియం చెల్లించాలి. ప్రీమియం చెల్లించిన రోజు నుంచి బీమా వర్తిస్తుంది. పంట నష్టం కూడా 15-12-2024 నుంచి 31-05-2025 మధ్య కాలంలో అధిక వర్షపాతం, గాలిలో తేమశాతం, వాతావరణ వ్యత్యాసం, అధిక గాలి వేగం, చీడపీడల ఉధృతి వంటి పరిణామాలను పరిగణించి పరిహారం లెక్కిస్తారు. మండల స్థాయి అధికారులు నష్టాన్ని లెక్కించి పరిహారాన్ని నిర్ణయిస్తారు.

అకాల లేక అధిక వర్షం	15-12-2024 నుంచి 28-02-2025
చీడపీడల వాతావరణం (ముసురు/తేమ)	15-12-2024 నుంచి 28-02-2025
ఉష్ణోగ్రతలో వ్యత్యాసం	01-01-2025 నుంచి 15-03-2025
అధిక గాలి వేగం	01-03-2024 నుంచి 31-05-2025

దరఖాస్తు చేసుకోవడం ఇలా...

ఒక్కో రైతు ఎన్ని ఎకరాలకు అయినా బీమా చేసుకోవచ్చు. భూమి పాసు బుక్కు జిరాక్స్, బ్యాంకు ఖాతా జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్, వీఏఏ, వీహెచ్ఏ, వీఎస్ఏల వద్ద పంట వేసినట్లు తీసుకున్న ధ్రువీకరణ పత్రం తీసుకుని దగ్గరలో ఉన్న బ్యాంకు లేదా కామన్ సర్వీసు సెంటర్ లేదా పీఎంఎఫ్‌బీవై వెబ్‌సైట్‌లో నేరుగా రైతులే నమోదు చేసుకుని బీమా సదుపాయం పొందవచ్చు.

మామిడి రైతులు సద్వినియోగం చేసుకోవాలి



ఎన్నో ఏళ్ల నిరీక్షణ తరువాత ఆర్‌డబ్ల్యూబీసీఐఎస్ పథకం అందుబాటులోకి వచ్చింది. అయితే అతివృష్టి, లేకపోతే అనావృష్టి కారణంగా జిల్లాలోని మామిడి రైతులు నష్టపోతున్నారు. బీమా పథకం వల్ల ఆ నష్టాలను కొంతవరకు తగ్గించుకునే అవకాశం ఉంది. రైతులు ఈనెల 15వ తేదీలోపు ప్రీమియం చెల్లించి బీమా పథకంలో నమోదు చేసుకోవాలి. సమయం తక్కువగా ఉన్నందువల్ల మా శాఖ ద్వారా మండలాల్లో రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

- రవిచంద్రబాబు, జిల్లా ఉద్యాన శాఖాధికారి

దశాబ్దాల ఆకాంక్షలను నెరవేర్చిన ప్రభుత్వం



మామిడి పంటకు బీమా సదుపాయం కల్పించాలని దశాబ్దాలుగా రైతులు ప్రభుత్వాలను డిమాండ్ చేస్తున్నారు. వాతావరణంలో ఏర్పడే మార్పుల కారణంగా ఎక్కువగా నష్టపోయేది మామిడి రైతులే. బీమా పథకం వల్ల వారి నష్టాలను కొంతవరకైనా పూడ్చుకునే అవకాశం ఉంటుంది. కూటమి ప్రభుత్వం మామిడి రైతులకు అనుకూలంగా తీసుకున్న నిర్ణయం కారణంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని రైతులకు ఎంతో ఉపయోగం కలుగుతుంది.

- బోదేషావలి, డీవీఎంసీ సభ్యుడు

రేషన్ బియ్యం స్థావరాలపై దాడులు

- 150 క్వింటాళ్ల అక్రమ నిల్వలు స్వాధీనం
- ఇద్దరిపై కేసు నమోదు



గోడౌన్‌లో రేషన్ బియ్యం నిల్వలను పరిశీలిస్తున్న అధికారులు

కలకడ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కలకడ మండలంలో రేషన్ బియ్యం అక్రమ స్థావరాలపై ఆదివారం అర్ధరాత్రి రెవెన్యూ అధికారులు, పోలీసులు మెరుపు దాడులు నిర్వహించారు. జేసీ ఆదర్శ రాజేంద్రన్ ఆదేశాల మేరకు డీఎస్‌వో రఘురామ్, తహశీల్దార్ ఫణికుమార్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో రెండు చోట్ల అక్రమంగా నిల్వ ఉంచిన 151 కింటాళ్ల రేషన్ బియ్యం నిల్వలు బట్టబయలైనవి. బాలయ్యగారిపల్లె పంచాయితీ ఎర్రయ్యగారిపల్లె సినిమా హాల్‌కు సమీపంలోని ఓ గోడౌన్‌లో ఆర్. వెంకటరమణకు చెందిన 6 కింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఇదే పంచాయితీ పరిధిలోని సిద్దేశ్వర ఆలయం మార్గంలోని సిమెంట్ ఇటుక ఫ్యాక్టరీ గోడౌన్‌లో మరో వ్యక్తి ఆర్. వెంకటరమణ నిల్వ ఉంచిన 145 కింటాళ్లను స్వాధీనం చేసుకున్నారు. కాగా వీరిద్దరు బాలయ్యగారిపల్లె పంచాయితీ కాపురస్థులు కావడం విశేషం. స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యాన్ని అధికారులు చిన్నమండ్యం సివిల్ సప్లయ్ గోడౌన్‌కు తరలించి ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు తహశీల్దార్ తెలిపారు. ఈ దాడుల్లో సీఐ గురునాథ్, ఎస్ఐ రామాంజనేయులు, సీఎస్‌డీటీలు ఫజుసుల్లా, విజయారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న కాలనీలలో ఇళ్ల నిర్మాణాల పరిశీలన



కాలనీలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ అధికారులు

పెద్దమండ్యం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పెద్దమండ్యం మండలంలోని జగనన్న కాలనీలోని వెలిగల్లు, తురకపల్లి లేఅవుట్‌లో గల ఇళ్ల నిర్మాణాలను, మౌలిక సదుపాయాలను సోమవారం జిల్లా హౌసింగ్ అధికారి సాంబశివ పరిశీలించారు. అక్కడ ఇళ్ల నిర్మాణాలెలా....? అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో ఈనెల 4వ తేదీ వెలువడి కథనానికి అధికారులు స్పందించారు. జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణ సౌకర్యాలపై గ్రామస్థులతో ఆరా తీశారు. లేఆవుట్‌లలో ఇళ్ల నిర్మాణాలు ఆగిపోడానికి కారణాలు తెలుసుకున్నారు. ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయడానికి సూచనలు ఇచ్చారు. వెలిగల్లు లేఆవుట్‌లో పక్కా గృహాల నిర్మాణాలను పిల్లర్లు వేసి పటిష్టంగా నిర్మించుకోవాలన్నారు. విద్యుత్ సౌకర్యం, బోరు వేయడంతో నీటి సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని పక్కాగృహాల నిర్మాణాలు వేగవంతం చేయడానికి ఇంజనీరు అసిస్టెంట్‌లకు సూచించారు. ఇంజనీరు అసిస్టెంట్‌లకు ఇచ్చిన ఇళ్ల నిర్మాణాల టార్గెట్ సకాలంలో పూర్తి చేయాలన్నారు. లేఆవుట్‌లో మౌలిక వసతులు కల్పనతో పాటు సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. అలాగే అర్హులైన నిరుపేదలు కేంద్ర ప్రభుత్వం పీఎంఏవై పథకం ద్వారా పక్కాగృహాల కొరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పీఎంఏవై పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం పక్కాగృహానికి రూ.2 లక్షలు ఆర్థికసాయం అందిస్తుందని తెలిపారు. అర్హులైన వారు భార్యభర్త ఆధార్ కార్డు, రేషన్ కార్డు, బ్యాంక్ ఖాతా పుస్తకం, పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు, కుల ధ్రువీకరణ పత్రాలతో జీఎస్ కార్యాలయం లేదా హౌసింగ్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు, జీఎస్ సిబ్బంది, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో పోలీసుల్లో ఉత్తేజం

కడప జిల్లా ఇన్‌చార్జ్ ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు



బెలూన్‌లు వదులుతున్న ఇన్‌చార్జ్ ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

సిద్దవటం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పోలీసుల్లో ఉత్తేజానికి క్రీడలు ఎంతో ముఖ్యమని కడప జిల్లా ఇన్‌చార్జ్ ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు అన్నారు. పోలీసు బెటాలియన్‌లో సోమవారం 17వ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన బెలూన్స్‌ను గాలిలోకి ఎగురవేసి క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు బెటాలియన్‌లో సిబ్బంది విధి నిర్వహణలో భాగంగా వివిధ రాష్ట్రాలకు వెళుతుంటారని, వారిలో ఉత్తేజానికి స్పోర్ట్స్ మీట్ ఎంతో అవసరమన్నారు. క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు మానసికంగా ఎంతో బలపడతారని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ కమాండెంట్ నాగేశ్వరప్ప, అసిస్టెంట్ కమాండెంట్ వెంకటరెడ్డి, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వెల్డర్ మృతి



సాదిక్‌బాషా మృతదేహం

కురబలకోట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో వెల్డర్ మృతి చెందిన సంఘటన సోమవారం మండలంలో జరిగింది. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. గుర్రకొండ మండలం తరిగొండకు చెందిన సాదిక్‌బాషా (28) వెల్డర్‌గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కాగా మండలంలోని మట్లివారిపల్లె పంచాయతీ ఎర్రమద్దివారిపల్లెలో పశువుల షెడ్డుకు రేకులు బిగించడానికి వెల్డింగ్ కోసం విద్యుత్ కనెక్షన్ తీస్తుండగా ప్రమాదవశాత్తు షాక్ తగిలి కిందపడిపోయాడు. ఆ సమయంలో అతడితో పాటు మరో ముగ్గురు గాయపడ్డారు. గాయపడ్డ వారిని ప్రైవేట్ వాహనంలో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొడవలితో తరగతి గదిలోకి...

వివేకానంద మున్సిపల్ హైస్కూల్‌లో కలకలం

మదనపల్లె అర్బన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక నీరుగట్టువారిపల్లె రామిరెడ్డి లేవుట్‌లోని వివేకానంద మున్సిపల్ హైస్కూల్‌లో సోమవారం పదో తరగతి చదువుతున్న విద్యార్థి కలకలం రేపాడు. ఉదయం స్కూల్‌కు వచ్చే సమయంలోనే తన పుస్తకాల బ్యాగ్‌లో కొడవలిని దాచుకుని స్కూల్‌కు వచ్చాడు. తరగతి గదిలో తోటి విద్యార్థులు గమనించి ఉపాధ్యాయులకు తెలిపారు. రాయచోటిలో ఉపాధ్యాయుడిపై విద్యార్థులు దాడి చేయడంతో ఆయన చనిపోయిన సంఘటన మరవక ముందే మదనపల్లెలో విద్యార్థి కొడవలి తీసుకుని పాఠశాలకు రావడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. అనంతరం ఉపాధ్యాయులు వన్‌టౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు పాఠశాలకు చేరుకుని విద్యార్థి వద్ద ఉన్న కొడవలిని స్వాధీనం చేసుకుని విద్యార్థికి, వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

జిల్లా ఇన్‌చార్జ్ ఎస్ఈగా రమణ

రాయచోటిటౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా ఇన్‌చార్జ్ ఎస్ఈగా ఎస్.రమణ సోమవారం రాయచోటి సర్కిల్ ఆఫీస్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్ఈగా ఉన్న చంద్రశేఖర్‌రెడ్డి మెడికల్ లీవ్‌పై వెళ్లడంతో ఆయన స్థానంలో కడప ఎస్ఈగా ఉన్న రమణ బాధ్యతలు తీసుకున్నారు. అనంతరం ఆయన చిన్నమండెం మండలంలోని కేశాపురం గ్రామంలో ఉన్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో విద్యుత్ సమస్యలు ఏమైనా ఉన్నట్లయితే వెంటనే తమ దృష్టి తెచ్చి పరిష్కరించుకోవాలని ఎస్ఈకి తెలిపారు.

మూగజీవాలకు అన్యాయం

- అధికారుల మాయాజాలం
- నట్టల నివారణ మందు 70 వేల గొర్రెలకు వేసినట్లు రికార్డులు
- గ్రామాల్లో క్యాంప్‌లు ఏర్పాటు చేయలేదంటున్న రైతులు

లక్కిరెడ్డిపల్లె, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : అధికారులు మాయాజాలం చేశారు... మూగజీవాలకు వేసే నట్టల నివారణ మందుల్లో కూడా చేతివాటం చూపించారని రైతులు ఆరోపిస్తున్నారు. వర్షాకాలంలో గొర్రెలు, మేకలకు జబ్బులు రాకుండా గ్రామాల్లో క్యాంపులు ఏర్పాటు చేసి వాటికి మందులు వేస్తారు. కానీ ఏ గ్రామంలో కూడా క్యాంపులు ఏర్పాటు చేయలేదని, కానీ రికార్డుల్లో మాత్రం 70 వేల జీవాలకు వేసినట్లు నమోదు చేశారని రైతులు ఆరోపిస్తున్నారు. లక్కిరెడ్డిపల్లె ప్రాంతం కరువుకు నిలయం. వర్షాలు పడితేగాని పంటలు పండవు. నాలుగు సంవత్సరాలుగా వర్షాలు సకాలంలో పడకపోవడంతో రైతులు వ్యవసాయం మానుకుని పశువులు, గొర్రెలు, మేకలు పెట్టుకుని జీవనం సాగిస్తున్నారు. మండలంలో 56,266 గొర్రెలు, 15,702 మేకలు ఉన్నాయి. మూగజీవాలు ఆరోగ్యంగా ఉండాలని ప్రభుత్వం ఏడాదికి రెండుసార్లు నట్టల నివారణ మందులు వేయడానికి లక్షల రూపాయలు ఖర్చు చేస్తోంది. అయితే పశు సంవర్ధక శాఖాఅధికారులు మాత్రం ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి మూగజీవాలకు మందులు వేయకపోయినా వేసినట్లు రికార్డుల్లో నమోదు చేసుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. మండలంలో లక్కిరెడ్డిపల్లె, కోనంపేట, పందిళ్లపల్లె పశు వైద్య కేంద్రాలు ఉన్నాయి. అందులో పందిళ్లపల్లెలో మాత్రం పశువైద్యాధికారి ఉన్నారు. లక్కిరెడ్డిపల్లెలో ఏడీఏహెచ్ ఉన్నారు. కోనంపేటలో పశువైద్యాధికారి లేరు. పశువుల కోసం వచ్చే నిధులన్నీ ఏడీఏహెచ్‌కు వస్తాయి. అయితే పశువుల చికిత్సల కోసం వచ్చే నిధులు ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టకుండా గ్రామాలకు వెళ్లినట్లు, పశువులకు మందులు వేసినట్లు రికార్డులు మాత్రం సృష్టిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. గొల్లపల్లె, పాళెం గొల్లపల్లె, చిన్నపోతులపల్లె, కాకుళవరం, అనంతపురం గ్రామాల్లో చాలామంది గొర్రెలు, మేకలు మేపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అలాంటి ఈ గ్రామాల్లో ఒక్క గొర్రెకు కూడా నట్టల నివారణ మందులు వేయలేదని వెంకటనారాయణ, చిన్నప్ప, శివయ్యతో పాటు పలువురు రైతులు తెలిపారు. నవంబరు నెలలో 16 నుంచి 31వ తేదీ వరకు ప్రతి గొర్రెకు, మేకకు నట్టల నివారణ మందులు వేయాలని ప్రభుత్వం మందులు పంపిణీ చేసింది. లక్కిరెడ్డిపల్లె పశువైద్యాధికారులు మాత్రం ఒక్కరోజు మద్దిరేవుల, రాచపల్లెలో జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి వచ్చినపుడు మాత్రం 10 గొర్రెలకు నట్టల నివారణ మందులు వేశారు. అనంతరం నవంబరు నెలాఖరు వరకు ఎటువంటి క్యాంపులు నిర్వహించలేదని రైతులు తెలిపారు. అయితే క్యాంపులు నిర్వహించినట్లు రికార్డులు మాత్రం పక్కాగా తయారు చేసినట్లు తెలుస్తోంది.

అన్ని గ్రామాల్లో క్యాంపులు పెట్టాం

- సుధీర్‌నాథ్ బెనర్జీ, పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు

మండలంలోని అన్ని గ్రామాల్లో నట్టల నివారణ క్యాంపులు ఏర్పాటు చేశాం. 70 వేల జీవాలకు మందులు వేశాం. సమాచారం కావాలంటే పేపర్లు తెచ్చుకోండి ప్రింట్ ఇస్తాం. మా దగ్గర పేపర్లులేవు అని సమాధానం ఇవ్వడం గమనార్హం.

ఏ అధికారి మా గొర్రెలకు మందులు వేయలేదు

- వెంకటనారాయణ గొల్లపల్లె అనంతపురం

నాకు 50 గొర్రెలు ఉన్నాయి. గొర్రెలు పెంచుకుని జీవనం సాగిస్తున్నా. గొర్రెలకు ఏ రోగాలు వచ్చినా డబ్బులు పెట్టి మందులు కొనుగోలు చేసి జీవాలను బతికించుకుంటున్నా. ఏ అధికారి మా జీవాల వద్దకు రాలేదు మూగజీవాలకు నట్టల నివారణ మందులు వేయలేదు. వర్షాకాలంలో జీవాలు మెత్తబడ్డాయి. ఎవరూ ఇంటి వద్దకు రాలేదు ఏ మందులు వేయలేదు.

పంటకు రక్షణ వలయం

- పంటలను ధ్వంసం చేస్తున్న అడవిపందులు
- వలలు, మెష్‌లు, పాత చీరలు కడుతున్న రైతులు
- వింత శబ్దాలు చేసే మైక్‌లు ఏర్పాటు



వేరుశనగ పంట చుట్టూ కట్టిన చీరలు

తంబళ్లపల్లె, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టించి అప్పు చేసి పండించుకునే పంటలకు సైతం రైతు రక్షణ కల్పించుకోలేని పరిస్థితి. పచ్చని పంటలకు రాత్రిళ్లు అటవీ జంతువులు, పగటి సమయంలో పశువులు, పక్షుల నుంచి రక్షించుకునేందుకు పొలం చుట్టూ పాతచీరెలు, వలలు, మెస్‌లు కడుతున్నారు. అంతే కాకుండా రాత్రి సమయాల్లో మైక్‌లు ఏర్పాటు చేసుకుని కుక్కల అరుపులు, మనుషులు అరుస్తున్నట్లు శబ్దాలు చేసేలా రూపొందించిన స్పీకర్లు ఏర్పాటు చేసుకుంటున్నారు. ఈ పద్ధతులు కొందరు రైతులకు సత్ఫలితాలనిస్తుంటే మరి కొందరికి గోరుచుట్టుపై రోకలి పోటన్నట్లు అడవి పందుల బెడద తప్పడం లేదు.

తంబళ్లపల్లెలో రైతులు ఎక్కువగా వేరుశనగ, వరి, మొక్కజొన్న పంటలను సాగు చేస్తారు. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన వరి, మొక్కజొన్న కోత దశలో ఉండగా రబీలో సాగు చేసిన వేరుశనగ ప్రారంభ దశలో ఉంది. అయితే ఈ పొలాలు ఎక్కువగా అటవీ సమీపాల్లో ఉండడంతో అడవిపందుల బెడద ఎక్కువగా ఉంటోంది. రాత్రి వేళ అడవి పందులు గుంపులు గుంపులుగా పంట పొలాల్లోకి జొరబడి బీభత్సం సృష్టిస్తున్నాయి. వరి, వేరుశనగ, మొక్కజొన్న, ఖర్బూజ పంటను నాశనం చేస్తూ తీరని నష్టాన్ని మిగులుస్తున్నాయి. విత్తు విత్తినప్పటి నుంచీ పంట చేతికొచ్చి మార్కెట్‌కు తరలించే వరకు రైతులు కంటి మీద కునుకు లేకుండా కాపలా కాస్తున్నా ఏదో ఒక సమయంలో అడవి పందులు పంటపై పడి ధ్వంసం చేయడం రైతుకు తలనొప్పిగా మారింది. దీంతో బాధిత రైతులు అడవిపందుల బారి నుంచి పంటలను కాపాడుకోవడానికి పలు రకాల పద్ధతులు అవలంబిస్తున్నారు.

పొలాల్లో మైక్‌లు ఏర్పాటు

పలువురు రైతులు వినూత్నంగా ఆలోచించి పంటలను రక్షించుకోవడానికి మనుషులు, కుక్కలు అరుపులు వచ్చే బ్యాటరీ మైక్‌లను పొలంలో ఏర్పాటు చేస్తున్నారు. ఈ మైక్‌లను తంబళ్లపల్లె, మదనపల్లె పట్టణాల నుంచి రూ.600 నుంచి రూ.800 వరకు కొనుగోలు చేసి తెచ్చుకున్నట్లు రైతులు చెబుతున్నారు. వీటిలో పలురకాల శబ్దాలతో రికార్డింగు చేసి ఉంటారు. పగలంతా ఇంటి వద్ద మైక్‌కు చార్జింగ్ పెట్టి.. రాత్రిళ్లు పంట మధ్యలో ఓ చోట చెట్టుకు కాని, కర్రకు కాని మైక్‌ను ఏర్పాటు చేసి ఆన్ చేస్తారు. ఈ మైక్ నుంచి వచ్చే శబ్దాలకు అడవి జంతువులు పంట వైపు రాకుండా పోతాయని మైక్‌లు పెట్టిన రైతులు పేర్కొంటున్నారు.

వరి పొలం ధ్వంసం చేశాయి

- రైతు, జాఫర్‌వల్లి, తంబళ్లపల్లె

ముప్పావు ఎకరాలో వరి సాగు చేశాను. పంటను పది, పదిహేను రోజుల్లో కోయాలి. అడవిపందుల నుంచి రక్షణగా పొలం చుట్టూ చీరలు కట్టాను. అయినా ఏదో మూల నుంచి దూరి వచ్చి పంట మీద పడి సుమారు 10 కుంటలకు పైగా మడిని ధ్వంసం చేశాయి. గతేడాది సాగు చేసిన వేరుశనగ పంటను అడవి పందులు నాశనం చేయడంతో చాలా వరకు నష్టపోయా.

రూ.15 వేలు వెచ్చించి మెష్‌లు కట్టించాను

- సైపుల్లా, రైతు, తంబళ్లపల్లె

నాలుగెకరాల్లో ఖర్బూజ సాగు చేశాను. ప్రస్తుతం పంట పిందె దశలో ఉండగా.. అడవి పందులు రోజూ రాత్రిళ్లు పంటలపై పడి నాశనం చేసేవి. దీంతో పొలం చుట్టూ నాలుగు అడుగుల మేర ఎత్తున నర్సరీ మెస్, వలలు కట్టించాను. కూలీలు, మెస్‌కు కలిపి సుమారు రూ.15వేలు వరకు ఖర్చు వచ్చింది. దీంతో అప్పటి నుంచి అడవిపందుల బెడద తప్పింది.

గతంలో చాలా నష్టపోయా


- రైతు, రామచంద్ర, తంబళ్లపల్లె

అడవి పందుల బెడదతో గతంలో చాలా వరకు పంట నష్టపోయాను. ఇప్పుడు నాలుగు ఎకరాల్లో ఉన్న మొక్కజొన్న పంటను వారం, పది రోజుల్లో కోయాలి. గతంలో లాగా నష్టపోకుండా ఈ సారి పొలం చుట్టూరా రూ.20వేలకు పైగా వెచ్చించి నర్సరీ మెస్‌లు, వలలు కట్టాను. పొలం మధ్యలో మైక్‌ను కూడా ఏర్పాటు చేశాను. దీంతో ఈ సారి అడవి పందుల నుంచి కొంత ఉపశమనం కలిగినట్లయింది.



మొక్కజొన్న పొలం చుట్టూ కట్టిన మెష్





రైతు రామచంద్ర పొలం మధ్యలో ఏర్పాటు చేసిన మైకు, అడవి పందులు ధ్వంసం చేసిన వరి పొలం

అంతర్‌రాష్ట్ర ద్విచక్ర వాహనాల దొంగలు అరెస్టు

● రూ.64 లక్షల విలువ చేసే 37 ద్విచక్రవాహనాలు స్వాధీనం ● జిల్లా అదనపు ఎస్పీ వెంకటాద్రి

రాయచోటిటౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాత్రిపూట ఇళ్ల ముందు పార్కు చేసిన ద్విచ క్రవాహనాలను లక్ష్యంగా చేసుకొని చోరీలకు పాల్పడుతున్న నలుగురు అంతరాష్ట్ర ద్విచ క్రవాహనాల దొంగలను ఆదివారం పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.65 లక్షల విలువ చేసే 37 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం రాయచోటి పట్టణంలోని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయ పరేడ్ మైదానంలో అదనపు ఎస్పీ వెంకటాద్రి వివరాలను వెల్లడించారు. అన్నమయ్య జిల్లాలో గత కొద్ది నెలలుగా మోటారు సైకిల్స్ చోరీకి గురవుతుండటంతో దొంగలను పట్టుకోవడానికి ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు రాయచోటి డీఎస్పీ ఎంఆర్ కృష్ణమోహన్, వాయల్పాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌బాబు, ఎస్‌ఐలు చంద్రశేఖర్, శ్రీమరిలు పోలీసు సిబ్బందితో ప్రత్యేక నిఘా పెట్టారు. పక్కా సమాచారం మేరకు ఆదివారం తెల్ల వారుజామున నాలుగు గంటల సమయంలో వాయల్పాడు రైల్వేస్టేషన్ దగ్గర మదనపల్లె- తిరుపతి రోడ్డులో వాహనాలు తనిఖీ చేప ట్టారు. ఆ సమయంలో మదనపల్లె వైపు నుంచి రెండు మోటారు సైకిల్స్‌లో నలు గురు వ్యక్తులు అనుమానాస్పదంగా రావడం గమ నించి పట్టుకుని విచారించగా నేరం అంగీ కరించారు.


వివరాలు వెల్లడిస్తున్న అన్నమయ్య జిల్లా అదనపు ఎస్పీ వెంకటాద్రి

నలుగురు వ్యక్తులు జల్సాలకు అలవాటుపడి వాయల్పాడు పోలీస్‌స్టేషన్ పరి ధిలో మూడు మోటారు సైకిళ్లు, చిత్తూరు, తిరుపతి జిల్లాలతో పాటు కర్ణాటక రాష్ట్రంలో మొత్తం 37 మోటారు సైకిళ్లు దొంగతనం చేసినట్టు నేరం ఒప్పుకున్నారు. దీంతో వారి వద్ద నుంచి రూ.65 లక్షల విలువ గల 37 మోటా రు సైకిల్స్‌ను రికవరీ చేసి నిందితులను కోర్టుకు హాజరు పెట్టినట్లు ఆయన తెలియజేశారు.

భుజంగేశ్వరస్వామి ఆలయంలో చోరీ

రైల్వేకోడూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భుజంగేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం అర్ధరాత్రి దొంగలు పడ్డారు. ఆలయం తలుపులు పగుగొట్టి హుండీలో ఉన్న డబ్బులను దోచుకెళ్లిన సంఘటన సోమవారం వెలుగుచూసింది. ఉదయం 6 గంటల సమయంలో ఆలయ అర్చకులు యోగీస్వామి ఆలయ తలుపులు తెరవడానికి చూడగా.. పగులగొట్టిన దృశ్యాలు కనిపించాయి. దీంతో ఆలయ ప్రధాన అర్చకులు బి.పవన్‌కుమార్‌శర్మ, దేవదాయశాఖ అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. రైల్వేకోడూరు సీఐ హేమసుందరరావు, ఎస్‌ఐ నవీన్‌బాబు సిబ్బందితో చోరీ జరిగిన ప్రాంతానికి చేరుకుని.. ఆలయంలో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజిని పరిశీలించారు. ఒక్క వ్యక్తి మాత్రమే ఆలయ గేటును ఇనుప రాడ్డుతో పగులగొట్టి హుండీలోని నోట్లును మాత్రమే చోరీ చేశాడు. పొడి చిల్లరను తాకలేదు. ఆలయంలో మొత్తం మూడు హుండీలు ఉండగా.. ఒక్క హుండీని పగులగొట్టి రూ.30,000లు చోరీ చేసినట్లు ఆలయ ఈవో కొండారెడ్డి తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా, దేవదాయశాఖ నిర్లక్ష్యంతో హుండీల లెక్కింపు చేసి రెండేళ్లు అయ్యిందని.. దీన్ని బాగా గమనించిన వ్యక్తే చోరీకి పాల్పడి ఉంటారని భక్తులు ఆరోపిస్తున్నారు. చోరీకి గురైన హుండీలో సుమారు రూ.5లక్షలు ఉంటుందని చెబుతున్నారు.



చోరీకి గురైన హుండీ, సీసీ కెమెరాల ఫుటేజిని పరిశీలిస్తున్న పోలీసులు

ఫిర్యాదుదారుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

కడప క్రైం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): న్యాయం కోసం పోలీసుస్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఇన్‌చార్జి ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు సిబ్బందిని హెచ్చరించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి సంబంధిత పోలీసుస్టేషన్లకు బదిలీ చేశారు. అలాగే వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుంచి సమస్యల పరిష్కారం కోసం వచ్చే ఫిర్యాదుదారుల సమస్యలను నిర్లక్ష్యం వహించకుండా సత్వరమే విచారణ జరిపి న్యాయం చేయాలని ఆదేశించారు.

ఎస్‌ఈగా చెన్నకేశవరెడ్డికి పదోన్నతి

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కడప పబ్లిక్ అండ్ హెల్త్ ఈఈగా విధులు నిర్వహిస్తున్న ఎన్.చెన్నకేశవరెడ్డిని తాత్కాలిక పద్ధతిలో సూపరింటెండెంట్ ఇంజనీరుగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. వేతన స్కేలులో తాత్కాలిక ప్రాతిపదికన కాలానుగుణంగా వర్తించే విధంగా ఆదేశాలు జారీ చేశారు.

బోగస్ పింఛన్లపై అధికారుల విచారణ

చాపాడు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీపేట గ్రామ పంచాయతీలోబోగస్ పింఛన్లు ఏరివేసేందుకు అధికారులు సోమవారం ఇంటింటి విచారణ చేశారు. ప్రభుత్వం లక్ష్మీపేట గ్రామ పంచాయతీని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసింది. కడప డీఆర్‌డీఏ పీడీ ఆనంద్‌నాయక్‌కు రాజుపాళెం, ప్రొద్దుటూరు, దువ్వూరు మండలాల ఎంపీడీవోలు సూర్యనారాయణరెడ్డి, రామకృష్ణయ్య, రమణారెడ్డి, ఏఈలు భరత్‌కుమార్‌రెడ్డి, ఈవోపీఆర్‌డీలు ఆలీంఖాన్, రామాంజనేయరెడ్డి, ఏవోలు వీరారెడ్డి, బాలన్న, మరో 12 మంది అధికారులు పది టీంలుగా ఏర్పడి విచారణ చేశారు. ఈ పంచాయతీ పరిధిలో లక్ష్మీపేట, కేతవరం, వీరభద్రాపురం, గ్రామాలు ఉన్నాయి. మొత్తం 400 పింఛన్లు విచారణ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. వీటిలో 380 పింఛన్లపై ఇంటింటికి వెళ్లి విచారణ చేసినట్లు అధికారులు తెలిపారు. మిగిలిన 20 మంది అందుబాటులో లేరన్నారు. మంగళవారం మళ్లీ మిగిలినవారిపై విచారణ చేస్తామన్నారు. ఈ విచారణలో ఈవోపీఆర్‌డీ క్రిష్ణవేణి, ఆగ్రామ కార్యదర్శులు వెంకటనాయుడు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.


విచారణ చేస్తున్న అధికారులు

వ్యక్తి మృతి కేసులో ముగ్గురు అరెస్టు

కడప(క్రైం), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మురుగుకాల్వ విషయమై ఇద్దరి మధ్య ఏర్పడిన ఘర్షణ కారణంగా ఓ వ్యక్తిని కొట్టడంతో అక్కడికక్క డే మృతి చెందాడు. ఈ కేసుకు సంబంధించి ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఇన్ చార్జి ఎస్పీ విద్యాసాగరనాయు డు వివరాలు వెల్లడించారు. చక్రాయపేట మండలం గొండికొవ్వూరు హరిజనవాడలో మురుగునీటి విష యమై ఈనెల 6న దండు యోగాంజనేయలుకు అతని పక్కింటిలో ఉంటున్న నాగార్జున మధ్య గొడవ చోటు చేసుకుంది. దీంతో నాగార్జున , అతని తల్లి సావిత్రమ్మ, భార్య నాగమణిలు దండు యోగాంజనేయులుపై కర్రలతో దాడి చేశారు. దీంతో అతను అక్కడికక్కడే కుప్పకూలిపోయి చనిపోయాడు. ముగ్గురిపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఈ మేరకు ఆర్కే వ్యాలీ సీఐ ఉలసయ్య, ఎస్‌ఐ బీవీ కిష్టయ్య నిందితుల కోసం గాలింపు చేపట్టి.. వేంపల్లె, రాయచోటి రోడ్డులోని గాలివీడు క్రాస్ వద్ద ఉండగా అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు ఎస్పీ తెలిపారు.


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

పట్టపగలు ఇంట్లో చోరీ

● 7 తులాల బంగారు అపహరణ

మైదుకూరు రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మైదుకూరు పట్టణంలోని వేదవ్యాస స్కూల్ సమీపంలో సోమవారం మధ్యాహ్నం ఉమ్మడి వెంకటశివ ఆనంద్ కుమార్ రెడ్డి అనే వ్యక్తి నివాసంలో దొంగతనం జరిగినట్లు పోలీసులు తెలిపారు. వెంటక శివ సొంత గ్రామం ముత్తలూరుపాడులో ఇంటి నిర్మాణ పనులు జరుగుతుండగా భార్యతో కలిసి ఉదయం అక్కడకు వెళ్లాడు. ఇంట్లో ఎవ్వరూ లేని విషయం పసిగట్టిన దొంగలు చోరీకి పాల్పడినట్లు తెలుస్తోందని పోలీసులు తెలిపారు. సుమారు 7 తులాల బంగారం చోరీకి గురైనట్లు తెలిపారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

పెళ్లింట విషాదం

● 6న కుమార్తె వివాహం... 8న తండ్రి మృతి ● ప్రమాదవశాత్తు రైలుకింద పడి..

ఎర్రగుంట్ల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రైల్లో ప్రయాణికులకు భోజనాలు (క్యాటరింగ్) ఇచ్చేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు అదే రైలుకింద పడి కందుకూరి సంజీవకుమార్ (63) మృతి చెందాడు. వివరాల్లోకెళితే.... ఎర్రగుంట్ల మెయిన్ బజార్‌లో సంజీవకుమార్ హోటల్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తెలున్నారు. శుక్రవారం కుమార్తె వివాహం పోరుమామిళ్లలో జరిగింది. కుమార్తె అత్తారింటినుంచి ఇంకా ఇంటికి కూడా రాలేదు. రైళ్లలో వెళ్లే ప్రయాణికులు ఎవరైనా ఫోన్లలో భోజనం కావాలని అడిగితే సంజీవకుమార్ కుటుంబం క్యాటరింగ్ చేస్తోంది. ఆదివారం జయంతి ఎక్స్‌ప్రెస్ నుంచి కొందరు భోజనాలు కావాలని ఫోన్ ద్వారా కోరడంతో తన కుమారుడు లేకపోవడంతో సంజీవకుమార్ భోజనాలు ఇచ్చేందుకు వెళ్లాడు. అయితే రైలులో ఉన్నవారికి భోజనాలు ఇచ్చే సమయంలో ప్రమాదవ శాత్తు ప్లాట్‌ఫారం 1కు రైలుకు మధ్యలో కదులుతున్న రైలుకింద పడిపోయాడు. దీంతో అతనికి ఎడమచేయి, కాలు కట్ కావడంతో తీవ్ర రక్తస్రావం జరిగింది. వెంటనే అతనిని 108లో రైల్వే పోలీసులు ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు. అయితే అతను చికిత్స పొందుతూ మృతి చెందాడు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, మృతుడు సంజీవకుమార్ ఇంట తీవ్ర విషాదం నెలకొంది. 6వ తేదీ శుక్రవారం పోరుమామిళ్లలో కుమార్తె పెళ్లి చేశారు. వారు ఇంకా ఇంటికి రాలేదు. ఆదివారం కుటుంబ మొత్తం తిరుమలకు వెళ్లి వేంక టేశ్వరస్వామిని దర్శించుకుని రావాల్సి ఉందని.. ఈ ప్రమాదం జరగడంతో నవ వధువులు పుట్టెడు దుఃఖంతో రావాల్సి వచ్చిందని బంధువులు తెలిపారు.



ఉరి వేసుకుని వ్యక్తి మృతి

సీకేదిన్నె,డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేరీనగర్‌లో సోమవారం ఉరి వేసుకుని నాగూర్ ప్రవీణ్ (32) అనే వ్యక్తి మృతి చెందినట్లు సీఐ శివశంకర్‌నాయక్ తెలిపారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరివేసుకుని చనిపోయాడన్నారు. మృతుని తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి.. పోస్టుమార్టంకు తరలించినట్లు తెలిపారు. ఖాజీపేట మండలం నాగసానిపల్లెకు చెందిన ప్రవీణ్ జీవనోపాధి కోసం ఇక్కడకు వచ్చి వెల్డింగ్ పనులు చేసుకుని జీవిస్తుండేవాడు. కాగా మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు సంతానం ఉన్నట్లు పోలీసులు తెలిపారు.



గుర్తు తెలియని శవం లభ్యం

మైదుకూరు రూరల్,డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగాయపల్లె గ్రామం వెలుపల ఉన్న జొన్నపుచెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకొన్న పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వయస్సు సుమారు 35 నుంచి 40 మధ్యలో ఉండవచ్చునని, శవం గుర్తించడానికి వీలులేనట్లు తెలిపారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

శ్రీకృష్ణదేవరాయల కాలనీలో చోరీ

● 2 తులాల బంగారం, 2 లక్షల నగదు అపహరణ

కడప క్రైం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కడప నగరం శ్రీకృష్ణదేవరాయల కాలనీలో సోమవారం పట్టపగలే ఓ ఇంట్లో దొంగలు పడి బంగారం, నగదు అపహరించారు. చిన్నచౌకు ఎస్‌ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి వివరాల మేరకు.. రామసుబ్బారెడ్డి సొంత పని నిమిత్తం కుటుంబ సభ్యులతో కలిసి కడప నగరానికి వచ్చారు. తిరిగి సాయంత్రం ఇంటికి వెళ్లి చూడగా ఇంటి తాళాలు పగిలిపోయి ఉండడంతో పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు రెండు తులాల బంగారు చైను, రూ.2 లక్షల నగదు చోరీకి గురైనట్లు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఇద్దరి అదృశ్యం

కడప క్రైం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కడప నగరం తిలక్‌నగర్‌కు చెందిన ఓ మహిళ, శాంతినగర్‌కు చెందిన ఓ వ్యక్తి అదృశ్యమైనట్లు రిమ్స్ పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు... తిలక్‌నగర్‌కు చెందిన చంద్రిక కడపలో పనిచేస్తుండేది. ఆదివారం షాపుకు వెళ్తున్నట్లు చెప్పి ఇంటి నుంచి వెళ్లిపోయిందని, తిరిగి ఇంటికి రాకపోవడంతో ఆమె తల్లి రెడ్డెమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు. అలాగే శాంతినగర్‌కు చెందిన దుర్గాప్రసాద్ బేల్దారి పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. హైదరాబాదులో పనిచేస్తూ అప్పుడప్పుడూ ఇంటికి వచ్చివెళ్లేవాడని, అక్టోబరు 10న ఇంటి నుంచి వెళ్లి ఇప్పటివరకు రాలేదని, ఆయన ఫోన్ కూడా స్విచ్ ఆఫ్ వస్తోందని తెలిపారు. భార్య విజయ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

తెలుగుభాషా, సాహిత్య సంపద పరిరక్షణ అందరి బాధ్యత: కలెక్టర్

కడప కల్చరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషా, సాహిత్య సంపదను భావితరాలకు వారసత్వ సంపదగా అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక సీపీ బ్రౌన్ సాహిత్య పరిశోధన గ్రంథాలయాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. తెలుగు భాషా సాహితీ సౌరభంలో మణి దీపంలా వెలుగొందుతున్న బ్రౌన్ పరిశోధనా కేంద్రాన్ని సందర్శించడం తనకు చాలా సంతృప్తినిచ్చిందన్నారు. వైవీయూకు అనుబంధంగా వున్న బ్రౌన్ భాషా పరిశోధనా కేంద్రం విస్తరణాభివృద్ధికి, యూనివర్శిటీ భాషా పరిశోధక యంత్రాంగం చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. అనంతరం ఆదరణ, ఔన్నత్యాన్ని కోల్పోయే స్థితిలో వున్న తెలుగు భాషా సాహిత్యాన్ని, పునర్లిఖించిన ఆంగ్లేయ సాహితీ శిఖరం.. చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ అని.. ఆయన సేవలు తెలుగు భాషా సాహితీవేత్తలకు ఆదర్శనీయం అన్నారు. కార్యక్రమంలో కడప ఆర్డీఓ జాన్ ఇర్విన్, కడప మున్సిపల్ కమిషనర్ మనోజ్‌రెడ్డి, బ్రౌన్ గ్రంథాలయ సలహామండలి సభ్యులు జానమద్ది విజయభాస్కర్, సంచాలకులు పార్వతి, లైబ్రరీ సిబ్బంది పాల్గొన్నారు.

వైవీయూ రెండో దశ అంతర్ కళాశాలల క్రీడా పోటీలు

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు వైవీయూ డాక్టర్ వైఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో వైవీయూ అంతర్ కళాశాలల వాలీబాల్ కబడ్డీ, టగ్‌ఆఫ్ వార్ పురుషులు, మహిళల క్రీడా పోటీలు ఈ నెల 14, 15 తేదీల్లో నిర్వహించనున్నట్లు క్రీడా బోర్డు కార్యదర్శి కె.రామసుబ్బారెడ్డి ప్రకటనలో తెలిపారు. ఈ క్రీడల్లో పాల్గొనే వారు 2024 జూలై 1 నాటికి 17 సంవత్సరాలు పైన 25 సంవత్సరాలు లోపు వయసు కలిగి విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలలో చదువుతుండాలన్నారు.

ఈ క్రీడల్లో పాల్గొనేవారు స్టడీ, టెన్త్ మార్క్స్ మెమో, ఇంటర్మీడియట్ మార్క్స్ మెమో, ఒరిజినల్ జిరాక్స్ పత్రాలు తీసుకుని 14న ఉదయం 8గంటల్లోపు వైఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో హాజరుకావాలని కోరారు. వివరాలకు 9052540530, 9000294626లను సంప్రదించాలన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

నందలూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం 36 మంది గర్భిణులకు వైద్యాధికారులు డాక్టర్ శరత్‌కమల్, డాక్టర్ కార్తీక్ విశ్వనాథ్ వైద్య పరీక్షలు నిర్వహించారు. గైనకాలజిస్టు డాక్టర్ మస్తానమ్మ 29 మందికి స్కానింగ్ చేసి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. రాయల్‌సేవా సమితి ఆధ్వర్యంలో పౌష్టికాహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ ఇన్‌చార్జి జంగంశెట్టి సుబ్బయ్య పాల్గొన్నారు.

భక్తిభావం కలిగి ఉండాలి

రైల్వేకోడూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు భక్తిభావం కలిగి ఉండాలని విశ్వహిందూపరిషత్ ప్రతినిధి బండాత్మకూరు సురేష్ తెలిపారు. విశ్వహిందూ పరిషత్, రాష్ట్రీయ స్వయంసేవక్, ఆధ్యాత్మిక సంస్థలు కలసి ఆదివారం రాత్రి రైల్వేకోడూరులోని గంగమ్మ భవన్‌లో హైందవ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్మాతిక సేవలో ప్రజలు తరించాలన్నారు. భక్తి ముక్తి మార్గాన్ని చూపుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు సురేశ్, విశ్వహిందూ పరిషత్ కోడూరు అధ్యక్షుడు దరిశా వెంకటరెడ్డి, కాళప్పగారి రాము, మనోహార్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

అమ్మో.. రింగు రోడ్డా..!

● అడుగడుగునా గోతులు ● తరచూ ప్రమాదాలు ● వాహనదారుల ఆందోళన



తారు తొలగిపోయి, గుంతలు పడిన రాయచోటి రింగురోడ్డు

రాయచోటి (కలెక్టరేట్), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాయచోటి రింగు రోడ్డు అంటే వాహనదారులు భయపడుతున్నారు. గత వారంలో కురిసిన వర్షాల కారణంగా ఈ పరిస్థితి మరీ తీవ్రంగా మారింది. 2009లో ప్రారంభమైన రాయచోటి రింగు రోడ్డు పనులు ఇప్పటికీ పూర్తి కాలేదు. రోడ్డుపై అక్కడక్కడ గుంతలు పడి అధ్వానంగా మారడంతో వాహనదారులు కొన్నేళ్లుగా నరకయాతన అనుభవిస్తున్నారు. కడప నుంచి బెంగుళూరు వెళ్లేందుకు ఇదే ప్రధాన మార్గం కావడంతో, ఈ రోడ్డు మీదుగా ప్రతిరోజూ ఇతర వాహనాలతోపాటు పెద్ద ఎత్తున సిమెంటు లారీలు వెళుతుంటాయి. వాహనాల రద్దీతోపాటు, ఏళ్ల తరబడి నిర్వహణ లేకపోవడంతో రోడ్డు మొత్తం పాడైపోయి పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ప్రతి రోజు వందలాది వాహనాలు ప్రయాణించే ఈ రహదారిని ఎన్‌హెచ్ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నా రన్న ఆరోపణలు బలంగా ఉన్నాయి. గత ఏడాది నుంచి ఈ పరిస్థితి మరీ తీవ్రం కావడంతో ఈ రోడ్డుపై ప్రయాణించేందుకు వాహనదారులు విముఖత చూపుతున్నారు. ఈ మధ్య కాలంలో కురిసిన వర్షాల కారణంగా ఈ రోడ్డు మరీ అధ్వానంగా మారింది. ఈ నేపథ్యంలో ఈ రహదారిలో తరచూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇప్పటికైనా ఎన్‌హెచ్ అధికారులు రాయచోటి రింగు రోడ్డుకు మరమ్మతులు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్థానికులు అంటున్నారు.

రహదారులు దారుణం



గత ప్రభుత్వం రహదారులను నిర్లక్ష్యం చేసింది.రాయచోటి రింగు రోడ్డుకు ఇప్పటి వరకు మరమ్మతులు చేయలేదు. కూటమి ప్రభుత్వంలోనైనా రింగురోడ్డు పనులు పూర్తి చేస్తే బాగుంటుంది..

- సిద్ధిగాళ్ల శ్రీనివాసులు, నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి

'అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలి'

చిట్వేలి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా అధికారులు పనిచేయాలని రాష్ట్ర ఖాదీ, గ్రామీణ పరిశ్రమల బోర్డు చైర్మన్ కేకే చౌదరి సూచించారు. స్థానిక ఎంపీపీ సభాభవంలో సోమవారం మండల అధ్యక్షుడు చంద్ర అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ ఫలాలు అందరికీ అందించేందుకు అధికారులు బాధ్యతగా పని చేయాలన్నారు. అనంతరం మండలంలో అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ అనిత దీప్తి మాట్లాడుతూ ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ప్రజలకు సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు సుబ్రమణ్యం రెడ్డి, రామాంజులనాయుడు, నాగార్జుననాయుడు, బాలాజీ, వెంకటేశ్వర్ రాజు, గుండాలయ్యయాదవ్, కరీముల్లా, ఎంపీటీసీ సభ్యుడు నాగార్జున, ఎంపీడీవో మోహన్, సీఐ వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

ఘనస్వాగతం

కేకే చౌదరి తొలిసారిగా మండలానికి వచ్చిన సందర్భంగా స్థానిక అంబేడ్కర్ సర్కిల్ నుంచి కొత్త బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కూటమి నాయకులతో కలిసి అంబేడ్కర్ విగ్రహానికి, కొత్తబస్టాండ్ వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



కేకే చౌదరికి ర్యాలీతో స్వాగతం పలుకుతున్న ప్రజలు

సామాజిక పెన్షన్ లబ్ధిదారుల వివరాలు తనిఖీ

పెనగలూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : సామాజిక పింఛన్ లబ్ధిదారుల వివరాలు తనిఖీ చేసేందుకు అన్నమయ్య జిల్లాలోని ఈటమాపురం గ్రామాన్ని ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసుకుంది. అన్నమయ్య జిల్లా డీఆర్‌డీఏపీడీ సత్యనారాయణ అధ్యక్షతన సోమవారం 12 మజరా గ్రామాల్లో ఇద్దరేసి చొప్పున 12 బృందాలు లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి తనిఖీ చేశాయి. ఈటమాపురం పంచాయతీ పరిధిలో అధికారులు అకస్మాత్తుగా తనిఖీ ప్రారంభించడంతో పనులకు వెళ్లిన పలువురు లబ్ధిదారులు విషయం తెలుసుకుని హడావుడిగా అధికారులను కలిశారు. అత్యవసర పనులపై పొరుగూళ్లకు వెళ్లినవారు కూడా పరుగు పరుగున వచ్చి అధికారుల ఎదుట హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ మాట్లాడుతూ లబ్ధిదారుల వివరాలు తనిఖీ చేసి నిర్ధారించే కార్యక్రమానికి ఈటమాపురం గ్రామాన్ని ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టుగా ఎన్నుకుందన్నారు. ఈ కార్యక్రమంలో పెనగలూరు ఎంపీడీవో ఎస్.విజయరావు, డీఎల్‌డీవో నరసింహమూర్తి, పెన్నన్ల ఏపీడీ ధర్మరాజు, ఐకేపీ ఎంపీఎం నిరంజన్‌కుమార్, చిట్వేలి, రాజంపేట ఎంఈవోలు శంకరయ్య, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులతో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ బృందం

మదనపల్లి తహసీల్దార్‌ను సస్పెండ్ చేయండి

● మాజీ సైనికుడి భూ సమస్యను తక్షణమే పరిష్కరించాలి

రాయచోటి కలెక్టరేట్, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికి లంచం డిమాండ్ చేయడంతో గొంతు కోసుకుని నిరసన వ్యక్తం చేసిన మాజీ సైనికుడి భూ సమస్య పరిష్క రించాలని, అవినీతికి పాల్పడుతున్న మదనపల్లి తహసీల్దార్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలని జిల్లా సీపీఐ కార్యదర్శి పీఎల్ నరసింహులు, వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి తోపు కృష్ణప్ప, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద ఆయా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పది రోజులుగా మదనపల్లి తహసీల్దార్ అవినీతిపై పత్రికల్లో వార్తలు వస్తున్నా, తన భూమిని మ్యుటేషన్ చేయడానికి లక్ష రూపాయలు తహసీల్దార్ లంచం అడిగిందని మాజీ ఎమ్మెల్సీ ఆరోపణలు చేసినా, ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని వారు ఆరోపించారు. సోమవారం తహసీల్దార్ వైఖరిని నిరసిస్తూ మాజీసైనికుడు గొంతు కోసుకున్నాడన్నారు. ఇప్పటికైనా ఆ తహసీల్దార్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని, అవినీతి ఆరోపణలపై సమగ్ర విచారణ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సిద్దిగాళ్ల శ్రీనివాసులు, విశ్వనాథ్‌నాయక్, కోటేశ్వరరావు, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మాధవ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు

అదానీ అవినీతిపై విచారణచేయాలి

● కలెక్టరేట్ వద్ద సీపీఐ ధర్నా

రాయచోటి(కలెక్టరేట్), డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): దేశంలో అదానీ గ్రూప్ కంపెనీల వ్యవహారాలపై విచారణ చేసి అవినీతికి పాల్పడిన వారిని తక్షణమే అరెస్టు చేయాలని, గత ప్రభుత్వం అదానీతో చేసుకున్న విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రూ అప్, సరుబాటు చార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే తక్షణమే ఆదానీని అరెస్టు చేయాలని, ఈ అవినీతి పర్వంలో బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాయచోటి నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు, జిల్లా కార్యవర్గ సభ్యులు సాంబశివ, విశ్వనాథ్‌నాయక్, కృష్ణప్ప, కోటేశ్వరరావు, సుధీర్‌కుమార్, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మాధవ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అన్నమాచార్య అధ్యాపకురాలికి డాక్టరేట్



రాజంపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషీన్ లర్నింగ్ అధ్యాపకురాలు స్వర్ణ సురేఖకు ఉత్తరప్రదేశ్‌లోని జేఎస్ యూనివర్సిటీ పీహెచ్‌డీ ప్రదానం చేసిందని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ఎంవీ నారాయణ తెలియ జేశారు. ది ఫ్యూచర్ ఆఫ్ క్వాంటమ్ కంప్యూటింగ్ ఆపర్చుని టీస్ అండ్ చాలెంజస్ అనే అంశంపై విజయవాడకు చెందిన డాక్టర్ దుగ్గిరాల శరత్‌బాబు ఆధ్వర్యంలో పరిశోధన చేశారన్నారు. యూనివర్సిటీ చాన్సలర్ డాక్టర్ చొప్పా గంగిరెడ్డి, ప్రొ చాన్సలర్ చొప్పా అభిషేక్‌రెడ్డి, వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ ఎన్.మల్లికా ర్జునరావు, ఏఐఎంఎల్ విభాగాధిపతి డాక్టర్ పి.హరికృష్ణ స్వర్ణ సురేఖను అభినందించారు.

రేషన్ డీలర్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

ఓబులవారిపల్లె, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కటికంవారిపల్లె బీసీ-బీ, పోలీసుస్టేషన్ వీధి (ఓసీ మహిళ) ఈడబ్ల్యూఎస్ అయ్యలరాజుపల్లె (ఎస్సీ) దిగువపల్లె (ఓసీ), జెండామాను వీధి (బీసీ-బీ మహిళ), ముక్కావారిపల్లె ఓసీ, ఎల్లాయపల్లె ఓసీ మహిళ, కావుపల్లె ఎస్సీ మహిళ, బి.కమ్మపల్లె ఓసీ, జీవీపురం ఓసీ, చెన్నరాజుపోడు ఓసీ, గొబ్బూరువారిపల్లె (బీసీ-డీ మహిళ), చిన్నంపల్లె ఓసీ మహిళ, మంగంపేట అగ్రహారం (ఓసీ), మంగళంపల్లె (బీసీ-ఈ) చౌక దుకాణాలకు డీలర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానించాలని రాజంపేట సబ్ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇంటర్ పాసై 18 నుంచి 40 ఏళ్ల లోపు వయసున్న వారు అర్హులన్నారు. డిసెంబరు 22న రాత పరీక్ష నిర్వహించి డిసెంబరు 26, 27 తేదీల్లో అభ్యర్థులను ఎంపిక చేస్తారని, ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని రెవెన్యూ సిబ్బంది తెలిపారు.

పెనగలూరు: మండలంలో 5 చౌక దుకాణాలకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దారు సీహెచ్ ఇంద్రాణి తెలిపారు. నరసింగరాజపురం ఓసీ, దిగువ సిద్దవరం ఎస్సీ, నారాయణనెల్లూరు బీసీ-బీ, పేరంవారిపల్లె ఓసీ మహిళ, ముద్రపల్లె ఎస్సీకి కేటాయించారు.

బీజేపీ బూత్ లెవెల్ కార్యవర్గం ఎన్నిక

రాజంపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని రామ్‌నగర్‌లో సోమ వారం బీజేపీ బూత్ లెవెల్ కమిటీ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోతుగుంట రమేష్‌నాయుడు, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి పట్టుపోగుల ఆదినారాయణ మాట్లాడుతూ బూత్ స్థాయి నుంచి బీజేపీ బలోపేతానికి ఈ కమిటీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలోను బీజేపీ ఆధ్వర్యంలో దేశం, రాష్ట్రం అభివృద్ధి చెందుతోందన్నారు. వచ్చే స్థానిక, సార్వత్రిక ఎన్నికల నాటికి రాష్ట్రంలో సంస్థాగతంగా బీజేపీని పటిష్ఠం చేసి అధికారంలోకి తీసుకువస్తామని తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా పి.మహేష్‌ను ఎన్నుకున్నారు.

తాగునీటి బోరు ప్రారంభం



తాగునీటి బోరును ప్రారంభిస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రామాపురం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లగుట్టపల్లెలో శనివారం బోరు, మోటారును రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాం ప్రసాద్ రెడ్డి ప్రారంభించి, కొళాయిలకు నీరు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలకేంద్రంలో తాగునీటి సమ స్య అధికంగా ఉండడంతో పాత రామాపురంలో బోరు వేసి మోటారు బిగించి, నల్లగుట్టపల్లితో పాటు బీసీ కాలనీకి నీరు సరఫరా చేశామన్నారు. రాబోయే రోజుల్లో ప్రతి గ్రామంలో బోరు వేసి నీటి సమస్య పరిష్కరిస్తామన్నారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపంపై విచారణ



మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపంపై విచారణ చేస్తున్న అధికారులు

సిద్దవటం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి):మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపించిందంటూ రెండు రోజుల క్రితం మండలంలోని పోలీసు బెటాలియన్‌లో నిర్వహించిన పేరెంట్స్, టీచర్స్ మీట్‌లో తల్లిదండ్రులుఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఈ అంశంపై సోమవారం అధికారులు విచారణ ప్రారంభించారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపించిందని పలుమార్లు హెచ్చరించినా, వంట ఏజెన్సీ సభ్యులు చర్యలు తీసుకోవడం లేదంటూ విద్యాకమిటీ సభ్యులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారి-2 అరుణ మాట్లాడుతూ మెనూ సరిగా పాటించడం లేదన్న ఫిర్యాదులపై విచారణ చేసి జిల్లా విద్యాశాఖాధికారికి నివేదిక సమర్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి తహసీల్దారు మాధవీలత, ఇన్‌చార్జి ఎంపీడీవో మెహతాజ్ యాస్మిన్, ఆర్ఐ ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు నాగమునిరెడ్డి, విద్యాకమిటీ చైర్మన్ హరి, కృష్ణయ్య కోఆప్షన్ సభ్యులు కృష్ణయాదవ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్డు పనులకు భూమి పూజ



రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న ముక్కా రూపానందరెడ్డి తదితరులు

ఓబులవారిపల్లె, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వైకోట గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న రాములమ్మ కాలనీలో రూ. 30 లక్షల వ్యయంతో ఏర్పా టు చేస్తున్న సిమెంట్ రోడ్డు పనులకు కోడూరు నియోజ కవర్గ టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేస్తామని తెలి పారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ అధ్యక్షుడు జి.వెంకటేశ్వర్ రాజు, సీనియర్ నాయకులు పున్నాటి వాసు దేవరెడ్డి, కమతం నాగరాజు, జనసేన నాయకులు జోగినేని మణి, అడపాల బాలాజీ, బజారు సుబ్రమణ్యం, ఎన్డీ యే కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలు తొలగించకపోతే చర్యలు



అక్రమ కట్టడాలను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి తహసీల్దారు మాధవీలత

సిద్దవటం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాధవరం గ్రామం పెద్దపల్లెలోని సర్వే నంబరు 864/7లో అక్రమంగా నిర్మిస్తున్న ఇంటిని ఇన్‌చార్జి తహసీల్దారు మాధవీలత సోమవారం పరిశీలించారు. ఈ నిర్మాణం చేసేవారికి ఎటువంటి పత్రాలు లేవని, స్వచ్ఛందంగా తొలగించక పోతే, తామే చర్యలు తీసుకుని స్థలాన్ని స్వాధీనం చేసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ స్థలం ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

శ్మశానానికి కాంపౌండ్‌వాల్ నిర్మించండి

పుల్లంపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కబ్జాదారులు కూల్చివేసి శ్మశానవాటిక ప్ర హరీ గోడను పునరుద్ధరించ డంతోపాటు, వారిపై చర్యలు తీసుకోవాలని సర్పంచ్ ఆకే పాటి శ్రీనివాసులరెడ్డి సోమ వారం నోడల్ ఆఫీసర్ కృష్ణారావుకు ఫిర్యాదు చేశారు. సోమవారం పుల్లంపేటలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లా డుతూ శ్మశానంలో అక్రమంగా పట్టా పొందిన విజయబాబుపై చర్యలు తీసుకోవాలన్నారు. అనువంశికంగా తమకు సంక్రమించిన భూములను మరొకరి పేరుతో ఆన్‌లైన్ చేశారని పత్తూరు శ్రీనివాసులు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు అరవింద్‌కిషోర్, అధికారులు పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి వితరణ

పుల్లంపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల పరి ధిలోని టి.కమ్మపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో గూడూ రు సీతమ్మ ట్రస్టు వ్యవస్థాప కులు గూడూరు సుబ్బరాయు డు నాయుడు సోమవారం 10 వేల రూపాయలు విలువ చేసే క్రీడా సామగ్రిని వితరణ చేశారు.ా ప్రధానోపాధ్యాయు రాలు భవిత, మండల టీడీపీ ఉపాధ్యక్షుడు కాపెర్ల చంద్రశేఖర్‌నాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఒంటిమిట్ట ఆలయానికి నిధులు కేటాయించాలి

ఒంటిమిట్ట, డిసెంబ రు 9 (ఆంధ్రజ్యోతి) : కోదండరామస్వామి ఆలయ అభివృద్ధికి రాష్ట్ర బడ్జెట్‌లో నిధు లు కేటాయించాలని జిల్లా సీపీఎం కార్యదర్శి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ఆ పార్టీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సోమశిల బ్యాక్‌వాటర్‌తో చెరువులను నింపి ఆయకట్టుకు నీరందించాలన్నారు. రైతులకు పెట్టుబడి సాయం, అమ్మ కు వందనం, మహిళలకు ప్రతినెల 1500, ఉచిత బస్సు సౌకర్యం అమలు చేయాలని కోరారు. ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాల అమలు కోసం పోరాటాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యు లు సుబ్బమ్మ, జిల్లా నాయకులు అవినాష్, సీపీఎం మండల కార్య దర్శి కోనేటి నరసయ్య, నాయకులు రాము, పార్వతమ్మ, వెంకటేశ్, సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

'పంట బీమా ప్రీమియం తగ్గించండి'

సుండుపల్లె, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): మామిడి రైతులకు క్రాప్ ఇన్సూరెన్స్ భారం తగ్గించాలంటూ రైతు సంఘం నాయకులు ఉద్యానశాఖ అధికారి వనితాబాయికి వినతి పత్రం అందజేశారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఎకరాకు రూ.45 వేలు బీమా వర్తింపజేయడం సంతోషకరమే అయినా, రైతు ధర రూ.2250 ప్రీమియం చెల్లించాల్సి వస్తోందని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ మొత్తాన్ని 500 రూపాయలు తగ్గించేలా చూడాలని కోరారు. గత ఐదేళ్లల్లో రైతులకు ఎటువంటి లబ్ధి చేకూరలేదని, ప్రభుత్వం దృష్టి సారించి రైతులకు మేలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా మిత్ర సంఘం మండల అధ్యక్షుడు సుబ్బరామరాజు, జిల్లా ఉత్తమ రైతు అమృనాయక్, టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర నాయకులు ఆనంద్‌నాయక్, రాజంపేట పార్లమెంట్ వాణిజ్య విభాగం అధికార ప్రతినిధి దామోదర్‌నాయుడు, జయరామ్‌నాయక్, జనసేన నాయకులు రామాశ్రీనివాసులు, రైతులు పాల్గొన్నారు.

మామిడి రైతుకు తీపి కబురు

- పంటల బీమాలో మామిడికి స్థానం
- ఎకరాకు ప్రీమియం కింద రూ.2250
- పంట నష్టం జరిగితే ఎకరాకు రూ.45 వేల పరిహారం
- ఈనెల 15లోపు బీమా చేయించుకోవాలి

పీలేరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మామిడి రైతులకు కూటమి ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. ఎన్నో దశాబ్దాలుగా మామిడి రైతులు డిమాండ్ చేస్తున్న బీమా సదుపాయాన్ని కల్పించింది. ఈ మేరకు శనివారం మామిడి రైతులకు అనుకూలంగా నిర్ణయం తీసుకుంది. పునర్వ్యవస్థీకరించబడిన వాతావరణ ఆధారిత పంటల బీమా ఆర్‌డబ్ల్యూబీసీఐఎస్ (రీస్ట్రక్చర్డ్ వెదర్ బేస్డ్ క్రాప్ ఇన్సూరెన్స్ స్కీం)లో మామిడిని చేర్చింది. దీంతో ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో పంటను కోల్పోయే మామిడి రైతులకు గణనీయంగా ఉపశమనం లభించనుంది. కూటమి సర్కారు తీసుకున్న ఈ నిర్ణయంతో రాష్ట్రంతో పాటు జిల్లాలోని మామిడి రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.



ఆర్‌డబ్ల్యూబీసీఐఎస్‌లో మామిడికి చోటు

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో లభిస్తున్న ప్రోత్సాహకాల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా మామిడి తోటల సాగు గణనీయంగా పెరిగింది. విస్తీర్ణం పెరిగి చాలామంది రైతులకు లబ్ధి చేకూరుతున్నప్పటికీ మామిడి పంటకు బీమా లేకపోవడంతో ప్రతి ఏటా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మామిడి పంటకు బీమా వర్తింపజేయాలని ఏళ్ల తరబడి రైతులు పోరాడుతున్నారు. వారి పోరాటం ఫలించి కూటమి ప్రభుత్వం వారికి అనుకూలంగా నిర్ణయం తీసుకుంది. అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ అనే కేంద్ర ప్రభుత్వ సంస్థ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో కాలానుకుణంగా వాతావరణంలో వచ్చే ప్రతికూల మార్పులతో పంట నష్టం కలిగే ఆర్థిక నష్టాల నుంచి రైతులను ఆదుకునేందుకు మన రాష్ట్రంలో ప్రస్తుత రబీ సీజన్ (2024-25)లో పునర్వ్యవస్థీకరించబడిన వాతావరణ ఆధారిత పంటల బీమా (ఆర్‌డబ్ల్యూబీసీఐఎస్) పథకాన్ని మామిడికి వర్తింపజేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్‌డబ్ల్యూబీసీఐఎస్ అమలవుతున్న జిల్లాల్లో అన్నమయ్యకు కూడా చోటు దక్కింది. దీంతో జిల్లాలో 36 వేల హెక్టార్లలో మామిడి సాగు చేస్తున్న సుమారు 20 వేల మంది రైతులకు లబ్ధి చేకూరనుంది.

ఎకరాకు రూ.2250 ప్రీమియం

ఆర్‌డబ్ల్యూబీసీఐఎస్ పథకం అమలవుతున్న 15 జిల్లాల్లో బీమా ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వం వేర్వేరుగా నిర్ణయించింది. అందులో భాగంగా అన్నమయ్య జిల్లాలోని మామిడి రైతులు ఎకరాకు రూ.2250 ప్రీమియం చెల్లించాలి. అలా ప్రీమియం చెల్లించిన రైతులకు రూ.45 వేల పరిహారం లభించే అవకాశం ఉంది. ఈనెల 15వ తేదీలోపు ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. అక్టోబరు 1, 2020 ముందు అనగా ఐదేళ్ల ముందు మామిడి తోటలు పెట్టిన వారికి మాత్రమే ఈ పథకం వర్తిస్తుంది.

బీమా అయ్యే అంశాలు, వర్తించే సమయం

ఆర్‌డబ్ల్యూబీసీఐఎస్ పథకం కోసం రైతులు ఈనెల 15వ తేదీలోపు ప్రీమియం చెల్లించాలి. ప్రీమియం చెల్లించిన రోజు నుంచి బీమా వర్తిస్తుంది. పంట నష్టం కూడా 15-12-2024 నుంచి 31-05-2025 మధ్య కాలంలో అధిక వర్షపాతం, గాలిలో తేమశాతం, వాతావరణ వ్యత్యాసం, అధిక గాలి వేగం, చీడపీడల ఉధృతి వంటి పరిణామాలను పరిగణించి పరిహారం లెక్కిస్తారు. మండల స్థాయి అధికారులు నష్టాన్ని లెక్కించి పరిహారాన్ని నిర్ణయిస్తారు.

అకాల లేక అధిక వర్షం	15-12-2024 నుంచి 28-02-2025
చీడపీడల వాతావరణం (ముసురు/తేమ)	15-12-2024 నుంచి 28-02-2025
ఉష్ణోగ్రతలో వ్యత్యాసం	01-01-2025 నుంచి 15-03-2025
అధిక గాలి వేగం	01-03-2024 నుంచి 31-05-2025

దరఖాస్తు చేసుకోవడం ఇలా...

ఒక్కో రైతు ఎన్ని ఎకరాలకు అయినా బీమా చేసుకోవచ్చు. భూమి పాసు బుక్కు జిరాక్స్, బ్యాంకు ఖాతా జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్, వీఏఏ, వీహెచ్ఏ, వీఎస్ఏల వద్ద పంట వేసినట్లు తీసుకున్న ధ్రువీకరణ పత్రం తీసుకుని దగ్గరలో ఉన్న బ్యాంకు లేదా కామన్ సర్వీసు సెంటర్ లేదా పీఎంఎఫ్‌బీవై వెబ్‌సైట్‌లో నేరుగా రైతులే నమోదు చేసుకుని బీమా సదుపాయం పొందవచ్చు.

మామిడి రైతులు సద్వినియోగం చేసుకోవాలి



ఎన్నో ఏళ్ల నిరీక్షణ తరువాత ఆర్‌డబ్ల్యూబీసీఐఎస్ పథకం అందుబాటులోకి వచ్చింది. అయితే అతివృష్టి, లేకపోతే అనావృష్టి కారణంగా జిల్లాలోని మామిడి రైతులు నష్టపోతున్నారు. బీమా పథకం వల్ల ఆ నష్టాలను కొంతవరకు తగ్గించుకునే అవకాశం ఉంది. రైతులు ఈనెల 15వ తేదీలోపు ప్రీమియం చెల్లించి బీమా పథకంలో నమోదు చేసుకోవాలి. సమయం తక్కువగా ఉన్నందువల్ల మా శాఖ ద్వారా మండలాల్లో రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

- రవిచంద్రబాబు, జిల్లా ఉద్యాన శాఖాధికారి

దశాబ్దాల ఆకాంక్షలను నెరవేర్చిన ప్రభుత్వం



మామిడి పంటకు బీమా సదుపాయం కల్పించాలని దశాబ్దాలుగా రైతులు ప్రభుత్వాలను డిమాండ్ చేస్తున్నారు. వాతావరణంలో ఏర్పడే మార్పుల కారణంగా ఎక్కువగా నష్టపోయేది మామిడి రైతులే. బీమా పథకం వల్ల వారి నష్టాలను కొంతవరకైనా పూడ్చుకునే అవకాశం ఉంటుంది. కూటమి ప్రభుత్వం మామిడి రైతులకు అనుకూలంగా తీసుకున్న నిర్ణయం కారణంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని రైతులకు ఎంతో ఉపయోగం కలుగుతుంది.

- బోదేషావలి, డీవీఎంసీ సభ్యుడు

రేషన్ బియ్యం స్థావరాలపై దాడులు

- 150 క్వింటాళ్ల అక్రమ నిల్వలు స్వాధీనం
- ఇద్దరిపై కేసు నమోదు



గోడౌన్‌లో రేషన్ బియ్యం నిల్వలను పరిశీలిస్తున్న అధికారులు

కలకడ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కలకడ మండలంలో రేషన్ బియ్యం అక్రమ స్థావరాలపై ఆదివారం అర్ధరాత్రి రెవెన్యూ అధికారులు, పోలీసులు మెరుపు దాడులు నిర్వహించారు. జేసీ ఆదర్శ రాజేంద్రన్ ఆదేశాల మేరకు డీఎస్‌వో రఘురామ్, తహశీల్దార్ ఫణికుమార్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో రెండు చోట్ల అక్రమంగా నిల్వ ఉంచిన 151 కింటాళ్ల రేషన్ బియ్యం నిల్వలు బట్టబయలైనవి. బాలయ్యగారిపల్లె పంచాయితీ ఎర్రయ్యగారిపల్లె సినిమా హాల్‌కు సమీపంలోని ఓ గోడౌన్‌లో ఆర్. వెంకటరమణకు చెందిన 6 కింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఇదే పంచాయితీ పరిధిలోని సిద్దేశ్వర ఆలయం మార్గంలోని సిమెంట్ ఇటుక ఫ్యాక్టరీ గోడౌన్‌లో మరో వ్యక్తి ఆర్. వెంకటరమణ నిల్వ ఉంచిన 145 కింటాళ్లను స్వాధీనం చేసుకున్నారు. కాగా వీరిద్దరు బాలయ్యగారిపల్లె పంచాయితీ కాపురస్థులు కావడం విశేషం. స్వాధీనం చేసుకున్న రేషన్ బియాన్ని అధికారులు చిన్నమండ్యం సివిల్ సప్లయ్ గోడౌన్‌కు తరలించి ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు తహశీల్దార్ తెలిపారు. ఈ దాడుల్లో సీఐ గురునాథ్, ఎస్‌ఐ రామాంజనేయులు, సీఎస్‌డీటీలు ఫజునుల్లా, విజయారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న కాలనీలలో ఇళ్ల నిర్మాణాల పరిశీలన



కాలనీలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ అధికారులు

పెద్దమండ్యం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పెద్దమండ్యం మండలంలోని జగనన్న కాలనీలోని వెలిగల్లు, తురకపల్లి లేఅవుట్‌లో గల ఇళ్ల నిర్మాణాలను, మౌలిక సదుపాయాలను సోమవారం జిల్లా హౌసింగ్ అధికారి సాంబశివ పరిశీలించారు. అక్కడ ఇళ్ల నిర్మాణాలెలా...? అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో ఈనెల 4వ తేదీ వెలువడిన కథనానికి అధికారులు స్పందించారు. జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణ సౌకర్యాలపై గ్రామస్థులతో ఆరా తీశారు. లేఅవుట్‌లలో ఇళ్ల నిర్మాణాలు ఆగిపోడానికి కారణాలు తెలుసుకున్నారు. ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయడానికి సూచనలు ఇచ్చారు. వెలిగల్లు లేఅవుట్‌లో పక్కా గృహాల నిర్మాణాలను పిల్లర్లు వేసి పటిష్టంగా నిర్మించుకోవాలన్నారు. విద్యుత్ సౌకర్యం, బోరు వేయడంతో నీటి సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని పక్కాగృహాల నిర్మాణాలు వేగవంతం చేయడానికి ఇంజనీరు అసిస్టెంట్‌లకు సూచించారు. ఇంజనీరు అసిస్టెంట్‌లకు ఇచ్చిన ఇళ్ల నిర్మాణాల టార్గెట్ సకాలంలో పూర్తి చేయాలన్నారు. లేఅవుట్‌లో మౌలిక వసతులు కల్పనతో పాటు సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. అలాగే అర్హులైన నిరుపేదలు కేంద్ర ప్రభుత్వం పీఎంఏవై పథకం ద్వారా పక్కాగృహాల కొరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పీఎంఏవై పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం పక్కాగృహానికి రూ.2 లక్షలు ఆర్థికసాయం అందిస్తుందని తెలిపారు. అర్హులైన వారు భార్యభర్త ఆధార్ కార్డు, రేషన్ కార్డు, బ్యాంక్ ఖాతా పుస్తకం, పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు, కుల ధ్రువీకరణ పత్రాలతో జీఎస్ కార్యాలయం లేదా హౌసింగ్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు, జీఎస్ సిబ్బంది, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో పోలీసుల్లో ఉత్తేజం

కడప జిల్లా ఇన్‌చార్జ్ ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు



బెలూన్‌లు వదులుతున్న ఇన్‌చార్జ్ ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

సిద్దవటం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పోలీసుల్లో ఉత్తేజానికి క్రీడలు ఎంతో ముఖ్యమని కడప జిల్లా ఇన్‌చార్జ్ ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు అన్నారు. పోలీసు బెటాలియన్‌లో సోమవారం 17వ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన బెలూన్స్‌ను గాలిలోకి ఎగురవేసి క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు బెటాలియన్‌లో సిబ్బంది విధి నిర్వహణలో భాగంగా వివిధ రాష్ట్రాలకు వెళుతుంటారని, వారిలో ఉత్తేజానికి స్పోర్ట్స్ మీట్ ఎంతో అవసరమన్నారు. క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు మానసికంగా ఎంతో బలపడతారని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ కమాండెంట్ నాగేశ్వరప్ప, అసిస్టెంట్ కమాండెంట్ వెంకటరెడ్డి, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వెల్డర్ మృతి



సాదిక్‌బాషా మృతదేహం

కురబలకోట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో వెల్డర్ మృతి చెందిన సంఘటన సోమవారం మండలంలో జరిగింది. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. గుర్రంకొండ మండలం తరిగొండకు చెందిన సాదిక్‌బాషా (28) వెల్డర్‌గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కాగా మండలంలోని మట్లివారిపల్లె పంచాయతీ ఎర్రమద్దివారిపల్లెలో పశువుల షెడ్డుకు రేకులు బిగించడానికి వెల్డింగ్ కోసం విద్యుత్ కనెక్షన్ తీస్తుండగా ప్రమాదవశాత్తు షాక్ తగిలి కిందపడిపోయాడు. ఆ సమయంలో అతడితో పాటు మరో ముగ్గురు గాయపడ్డారు. గాయపడ్డ వారిని ప్రైవేట్ వాహనంలో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు ముదివేడు ఎస్‌ఐ దిలీప్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొడవలితో తరగతి గదిలోకి...

వివేకానంద మున్సిపల్ హైస్కూల్‌లో కలకలం

మదనపల్లె అర్బన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక నీరుగట్టువారిపల్లె రామిరెడ్డి లేవుట్‌లోని వివేకానంద మున్సిపల్ హైస్కూల్‌లో సోమవారం పదో తరగతి చదువుతున్న విద్యార్థి కలకలం రేపాడు. ఉదయం స్కూల్‌కు వచ్చే సమయంలోనే తన పుస్తకాల బ్యాగ్‌లో కొడవలిని దాచుకుని స్కూల్‌కు వచ్చాడు. తరగతి గదిలో తోటి విద్యార్థులు గమనించి ఉపాధ్యాయులకు తెలిపారు. రాయచోటిలో ఉపాధ్యాయుడిపై విద్యార్థులు దాడి చేయడంతో ఆయన చనిపోయిన సంఘటన మరవక ముందే మదనపల్లెలో విద్యార్థి కొడవలి తీసుకుని పాఠశాలకు రావడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. అనంతరం ఉపాధ్యాయులు వన్‌టౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు పాఠశాలకు చేరుకుని విద్యార్థి వద్ద ఉన్న కొడవలిని స్వాధీనం చేసుకుని విద్యార్థికి, వారి తల్లిందద్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

జిల్లా ఇన్‌చార్జ్ ఎస్ఈగా రమణ

రాయచోటిటౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా ఇన్‌చార్జ్ ఎస్ఈగా ఎస్.రమణ సోమవారం రాయచోటి సర్కిల్ ఆఫీస్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్ఈగా ఉన్న చంద్రశేఖర్‌రెడ్డి మెడికల్ లీవ్‌పై వెళ్లడంతో ఆయన స్థానంలో కడప ఎస్ఈగా ఉన్న రమణ బాధ్యతలు తీసుకున్నారు. అనంతరం ఆయన చిన్నమండెం మండలంలోని కేశాపురం గ్రామంలో ఉన్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో విద్యుత్ సమస్యలు ఏమైనా ఉన్నట్లయితే వెంటనే తమ దృష్టి తెచ్చి పరిష్కరించుకోవాలని ఎస్ఈకి తెలిపారు.

మూగజీవాలకు అన్యాయం

- అధికారుల మాయాజాలం
- నట్టల నివారణ మందు 70 వేల గొర్రెలకు వేసినట్లు రికార్డులు
- గ్రామాల్లో క్యాంప్‌లు ఏర్పాటు చేయలేదంటున్న రైతులు

లక్కిరెడ్డిపల్లె, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : అధికారులు మాయాజాలం చేశారు... మూగజీవాలకు వేసే నట్టల నివారణ మందుల్లో కూడా చేతివాటం చూపించారని రైతులు ఆరోపిస్తున్నారు. వర్షాకాలంలో గొర్రెలు, మేకలకు జబ్బులు రాకుండా గ్రామాల్లో క్యాంపులు ఏర్పాటు చేసి వాటికి మందులు వేస్తారు. కానీ ఏ గ్రామంలో కూడా క్యాంపులు ఏర్పాటు చేయలేదని, కానీ రికార్డుల్లో మాత్రం 70 వేల జీవాలకు వేసినట్లు నమోదు చేశారని రైతులు ఆరోపిస్తున్నారు. లక్కిరెడ్డిపల్లె ప్రాంతం కరువుకు నిలయం. వర్షాలు పడితేగాని పంటలు పండవు. నాలుగు సంవత్సరాలుగా వర్షాలు సకాలంలో పడకపోవడంతో రైతులు వ్యవసాయం మానుకుని పశువులు, గొర్రెలు, మేకలు పెట్టుకుని జీవనం సాగిస్తున్నారు. మండలంలో 56,266 గొర్రెలు, 15,702 మేకలు ఉన్నాయి. మూగజీవాలు ఆరోగ్యంగా ఉండాలని ప్రభుత్వం ఏడాదికి రెండుసార్లు నట్టల నివారణ మందులు వేయడానికి లక్షల రూపాయలు ఖర్చు చేస్తోంది. అయితే పశు సంవర్థక శాఖాఅధికారులు మాత్రం ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి మూగజీవాలకు మందులు వేయకపోపోయినా వేసినట్లు రికార్డుల్లో నమోదు చేసుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. మండలంలో లక్కిరెడ్డిపల్లె, కోనంపేట, పందిళ్లపల్లె పశు వైద్య కేంద్రాలు ఉన్నాయి. అందులో పందిళ్లపల్లెలో మాత్రం పశువైద్యాధికారి ఉన్నారు. లక్కిరెడ్డిపల్లెలో ఏడీఏహెచ్ ఉన్నారు. కోనంపేటలో పశువైద్యాధికారి లేరు. పశువుల కోసం వచ్చే నిధులన్నీ ఏడీఏహెచ్‌కు వస్తాయి. అయితే పశువుల చికిత్సల కోసం వచ్చే నిధులు ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టకుండా గ్రామాలకు వెళ్లినట్లు, పశువులకు మందులు వేసినట్లు రికార్డులు మాత్రం సృష్టిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. గొల్లపల్లె, పాళెం గొల్లపల్లె, చిన్నపోతులపల్లె, కాకుళవరం, అనంతపురం గ్రామాల్లో చాలామంది గొర్రెలు, మేకలు మేపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అలాంటి ఈ గ్రామాల్లో ఒక్క గొర్రెకు కూడా నట్టల నివారణ మందులు వేయలేదని వెంకటనారాయణ, చిన్నప్ప, శివయ్యతో పాటు పలువురు రైతులు తెలిపారు. నవంబరు నెలలో 16 నుంచి 31వ తేదీ వరకు ప్రతి గొర్రెకు, మేకకు నట్టల నివారణ మందులు వేయాలని ప్రభుత్వం మందులు పంపిణీ చేసింది. లక్కిరెడ్డిపల్లె పశువైద్యాధికారులు మాత్రం ఒక్కరోజు మద్దిరేవుల, రాచపల్లెలో జిల్లా పశు సంవర్థక శాఖాధికారి వచ్చినపుడు మాత్రం 10 గొర్రెలకు నట్టల నివారణ మందులు వేశారు. అనంతరం నవంబరు నెలాఖరు వరకు ఎటువంటి క్యాంపులు నిర్వహించలేదని రైతులు తెలిపారు. అయితే క్యాంపులు నిర్వహించినట్లు రికార్డులు మాత్రం పక్కాగా తయారు చేసినట్లు తెలుస్తోంది.

అన్ని గ్రామాల్లో క్యాంపులు పెట్టాం

- సుధీర్‌నాథ్ బెనర్జీ, పశుసంవర్థకశాఖ సహాయ సంచాలకులు

మండలంలోని అన్ని గ్రామాల్లో నట్టల నివారణ క్యాంపులు ఏర్పాటు చేశాం. 70 వేల జీవాలకు మందులు వేశాం. సమాచారం కావాలంటే పేపర్లు తెచ్చుకోండి ప్రింట్ ఇస్తాం. మా దగ్గర పేపర్లులేవు అని సమాధానం ఇవ్వడం గమనార్హం.

ఏ అధికారి మా గొర్రెలకు మందులు వేయలేదు

- వెంకటనారాయణ గొల్లపల్లె అనంతపురం

నాకు 50 గొర్రెలు ఉన్నాయి. గొర్రెలు పెంచుకుని జీవనం సాగిస్తున్నా. గొర్రెలకు ఏ రోగాలు వచ్చినా డబ్బులు పెట్టి మందులు కొనుగోలు చేసి జీవాలను బతికించుకుంటున్నా. ఏ అధికారి మా జీవాల వద్దకు రాలేదు మూగజీవాలకు నట్టల నివారణ మందులు వేయలేదు. వర్షాకాలంలో జీవాలు మెత్తబడ్డాయి. ఎవరూ ఇంటి వద్దకు రాలేదు ఏ మందులు వేయలేదు.

పంటకు రక్షణ వలయం

- పంటలను ధ్వంసం చేస్తున్న అడవిపందులు
- వలలు, మెష్‌లు, పాత చీరలు కడుతున్న రైతులు
- వింత శబ్దాలు చేసే మైక్‌లు ఏర్పాటు



వేరుశనగ పంట చుట్టూ కట్టిన చీరలు

తంబళ్లపల్లె, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టించి అప్పు చేసి పండించుకునే పంటలకు సైతం రైతు రక్షణ కల్పించుకోలేని పరిస్థితి. పచ్చని పంటలకు రాత్రిళ్లు అటవీ జంతువులు, పగటి సమయంలో పశువులు, పక్షుల నుంచి రక్షించుకునేందుకు పొలం చుట్టూ పాతచీరెలు, వలలు, మెస్‌లు కడుతున్నారు. అంతే కాకుండా రాత్రి సమయాల్లో మైక్‌లు ఏర్పాటు చేసుకుని కుక్కల అరుపులు, మనుషులు అరుస్తున్నట్లు శబ్దాలు చేసేలా రూపొందించిన స్పీకర్లు ఏర్పాటు చేసుకుంటున్నారు. ఈ పద్ధతులు కొందరు రైతులకు సత్ఫలితాలనిస్తుంటే మరి కొందరికి గోరుచుట్టుపై రోకలి పోటన్నట్లు అడవి పందుల బెడద తప్పడం లేదు.

తంబళ్లపల్లెలో రైతులు ఎక్కువగా వేరుశనగ, వరి, మొక్కజొన్న పంటలను సాగు చేస్తారు. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన వరి, మొక్కజొన్న కోత దశలో ఉండగా రబీలో సాగు చేసిన వేరుశనగ ప్రారంభ దశలో ఉంది. అయితే ఈ పొలాలు ఎక్కువగా అటవీ సమీపాల్లో ఉండడంతో అడవిపందుల బెడద ఎక్కువగా ఉంటోంది. రాత్రి వేళ అడవి పందులు గుంపులు గుంపులుగా పంట పొలాల్లోకి జొరబడి బీభత్సం సృష్టిస్తున్నాయి. వరి, వేరుశనగ, మొక్కజొన్న, ఖర్బూజ పంటను నాశనం చేస్తూ తీరని నష్టాన్ని మిగులుస్తున్నాయి. విత్తు విత్తినప్పటి నుంచీ పంట చేతికొచ్చి మార్కెట్‌కు తరలించే వరకు రైతులు కంటి మీద కునుకు లేకుండా కాపలా కాస్తున్నా ఏదో ఒక సమయంలో అడవి పందులు పంటపై పడి ధ్వంసం చేయడం రైతుకు తలనొప్పిగా మారింది. దీంతో బాధిత రైతులు అడవిపందుల బారి నుంచి పంటలను కాపాడుకోవడానికి పలు రకాల పద్ధతులు అవలంబిస్తున్నారు.

పొలాల్లో మైక్‌లు ఏర్పాటు

పలువురు రైతులు వినూత్నంగా ఆలోచించి పంటలను రక్షించుకోవడానికి మనుషులు, కుక్కలు అరుపులు వచ్చే బ్యాటరీ మైక్‌లను పొలంలో ఏర్పాటు చేస్తున్నారు. ఈ మైక్‌లను తంబళ్లపల్లె, మదనపల్లె పట్టణాల నుంచి రూ.600 నుంచి రూ.800 వరకు కొనుగోలు చేసి తెచ్చుకున్నట్లు రైతులు చెబుతున్నారు. వీటిలో పలురకాల శబ్దాలతో రికార్డింగు చేసి ఉంటారు. పగలంతా ఇంటి వద్ద మైక్‌కు చార్జింగ్ పెట్టి.. రాత్రిళ్లు పంట మధ్యలో ఓ చోట చెట్టుకు కాని, కర్రకు కాని మైక్‌ను ఏర్పాటు చేసి ఆన్ చేస్తారు. ఈ మైక్ నుంచి వచ్చే శబ్దాలకు అడవి జంతువులు పంట వైపు రాకుండా పోతాయని మైక్‌లు పెట్టిన రైతులు పేర్కొంటున్నారు.

వరి పొలం ధ్వంసం చేశాయి

- రైతు, జాఫర్‌వల్లి, తంబళ్లపల్లె

ముప్పావు ఎకరాలో వరి సాగు చేశాను. పంటను పది, పదిహేను రోజుల్లో కోయాలి. అడవిపందుల నుంచి రక్షణగా పొలం చుట్టూ చీరలు కట్టాను. అయినా ఏదో మూల నుంచి దూరి వచ్చి పంట మీద పడి సుమారు 10 కుంటలకు పైగా మడిని ధ్వంసం చేశాయి. గతేడాది సాగు చేసిన వేరుశనగ పంటను అడవి పందులు నాశనం చేయడంతో చాలా వరకు నష్టపోయా.

రూ.15 వేలు వెచ్చించి మెష్‌లు కట్టించాను

- సైపుల్లా, రైతు, తంబళ్లపల్లె

నాలుగెకరాల్లో ఖర్బూజ సాగు చేశాను. ప్రస్తుతం పంట పిందె దశలో ఉండగా.. అడవి పందులు రోజూ రాత్రిళ్లు పంటలపై పడి నాశనం చేసేవి. దీంతో పొలం చుట్టూ నాలుగు అడుగుల మేర ఎత్తున నర్సరీ మెస్, వలలు కట్టించాను. కూలీలు, మెస్‌కు కలిపి సుమారు రూ.15వేలు వరకు ఖర్చు వచ్చింది. దీంతో అప్పటి నుంచి అడవిపందుల బెడద తప్పింది.

గతంలో చాలా నష్టపోయా

- రైతు, రామచంద్ర, తంబళ్లపల్లె

అడవి పందుల బెడదతో గతంలో చాలా వరకు పంట నష్టపోయాను. ఇప్పుడు నాలుగు ఎకరాల్లో ఉన్న మొక్కజొన్న పంటను వారం, పది రోజుల్లో కోయాలి. గతంలో లాగా నష్టపోకుండా ఈ సారి పొలం చుట్టూరా రూ.20వేలకు పైగా వెచ్చించి నర్సరీ మెస్‌లు, వలలు కట్టాను. పొలం మధ్యలో మైక్‌ను కూడా ఏర్పాటు చేశాను. దీంతో ఈ సారి అడవి పందుల నుంచి కొంత ఉపశమనం కలిగినట్లయింది.



మొక్కజొన్న పొలం చుట్టూ కట్టిన మెష్





రైతు రామచంద్ర పొలం మధ్యలో ఏర్పాటు చేసిన మైకు, అడవి పందులు ధ్వంసం చేసిన వరి పొలం

అంతర్‌రాష్ట్ర ద్విచక్ర వాహనాల దొంగలు అరెస్టు

● రూ.64 లక్షల విలువ చేసే 37 ద్విచక్రవాహనాలు స్వాధీనం ● జిల్లా అదనపు ఎస్పీ వెంకటాద్రి

రాయచోటిటౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాత్రిపూట ఇళ్ల ముందు పార్కు చేసిన ద్విచ క్రవాహనాలను లక్ష్యంగా చేసుకొని చోరీలకు పాల్పడుతున్న నలుగురు అంతరాష్ట్ర ద్విచ క్రవాహనాల దొంగలను ఆదివారం పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.65 లక్షల విలువ చేసే 37 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం రాయచోటి పట్టణంలోని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయ పరేడ్ మైదానంలో అదనపు ఎస్పీ వెంకటాద్రి వివరాలను వెల్లడించారు. అన్నమయ్య జిల్లాలో గత కొద్ది నెలలుగా మోటారు సైకిల్స్ చోరీకి గురవుతుండటంతో దొంగలను పట్టుకోవడానికి ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు రాయచోటి డీఎస్పీ ఎంఆర్ కృష్ణమోహన్, వాయల్పాడు సర్కిల్ ఇన్స్‌పెక్టర్ ప్రసాద్‌బాబు, ఎస్ఐలు చంద్రశేఖర్, శ్రీమరిలు పోలీసు సిబ్బందితో ప్రత్యేక నిఘా పెట్టారు. పక్కా సమాచారం మేరకు ఆదివారం తెల్ల వారుజామున నాలుగు గంటల సమయంలో వాయల్పాడు రైల్వేస్టేషన్ దగ్గర మదనపల్లె- తిరుపతి రోడ్డులో వాహనాలు తనిఖీ చేప ట్టారు. ఆ సమయంలో మదనపల్లె వైపు నుంచి రెండు మోటారు సైకిల్స్‌లో నలు గురు వ్యక్తులు అనుమానాస్పదంగా రావడం గమ నించి పట్టుకుని విచారించగా నేరం అంగీ కరించారు.



వివరాలు వెల్లడిస్తున్న అన్నమయ్య జిల్లా అదనపు ఎస్పీ వెంకటాద్రి

నలుగురు వ్యక్తులు జల్సాలకు అలవాటుపడి వాయల్పాడు పోలీస్‌స్టేషన్ పరి ధిలో మూడు మోటారు సైకిళ్లు, చిత్తూరు, తిరుపతి జిల్లాలతో పాటు కర్ణాటక రాష్ట్రంలో మొత్తం 37 మోటారు సైకిళ్లు దొంగతనం చేసినట్లు నేరం ఒప్పుకున్నారు. దీంతో వారి వద్ద నుంచి రూ.65 లక్షల విలువ గల 37 మోటా రు సైకిల్స్‌ను రికవరీ చేసి నిందితులను కోర్టుకు హాజరు పెట్టినట్లు ఆయన తెలియజేశారు.

భుజంగేశ్వరస్వామి ఆలయంలో చోరీ

రైల్వేకోడూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భుజంగేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం అర్ధరాత్రి దొంగలు పడ్డారు. ఆలయం తలుపులు పగుగొట్టి హుండీలో ఉన్న డబ్బులను దోచుకెళ్లిన సంఘటన సోమవారం వెలుగుచూసింది. ఉదయం 6 గంటల సమయంలో ఆలయ అర్చకులు యోగీస్వామి ఆలయ తలుపులు తెరవడానికి చూడగా.. పగులగొట్టిన దృశ్యాలు కనిపించాయి. దీంతో ఆలయ ప్రధాన అర్చకులు బి.పవన్‌కుమార్‌శర్మ, దేవదాయశాఖ అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. రైల్వేకోడూరు సీఐ హేమసుందరరావు, ఎస్ఐ నవీన్‌బాబు సిబ్బందితో చోరీ జరిగిన ప్రాంతానికి చేరుకుని.. ఆలయంలో ఉన్న సీసీ కెమెరాల పుటేజీని పరిశీలించారు. ఒక్క వ్యక్తి మాత్రమే ఆలయ గేటును ఇనుప రాడ్డుతో పగులగొట్టి హుండీలోని నోట్లను మాత్రమే చోరీ చేశాడు. పాడి చిల్లరను తాకలేదు. ఆలయంలో మొత్తం మూడు హుండీలు ఉండగా.. ఒక్క హుండీని పగులగొట్టి రూ.30,000లు చోరీ చేసినట్లు ఆలయ ఈవో కొండారెడ్డి తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా, దేవదాయశాఖ





చోరీకి గురైన హుండీ, సీసీ కెమెరాల పుటేజిని పరిశీలిస్తున్న పోలీసులు

నిర్లక్ష్యంతో హుండీల లెక్కింపు చేసి రెండేళ్లు అయ్యిందని.. దీన్ని బాగా గమనించిన వ్యక్తే చోరీకి పాల్పడి ఉంటారని భక్తులు ఆరోపిస్తున్నారు. చోరీకి గురైన హుండీలో సుమారు రూ.5లక్షలు ఉంటుందని చెబుతున్నారు.

వ్యక్తి మృతి కేసులో ముగ్గురు అరెస్టు

కడప(క్రైం), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మురుగుకాల్వ విషయమై ఇద్దరి మధ్య ఏర్పడిన ఘర్షణ కారణంగా ఓ వ్యక్తిని కొట్టడంతో అక్కడికక్క డే మృతి చెందాడు. ఈ కేసుకు సంబంధించి ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఇన్ చార్జి ఎస్పీ విద్యాసాగరనాయు డు వివరాలు వెల్లడించారు. చక్రాయపేట మండలం గొండికొవ్వూరు హరిజనవాడలో మురుగునీటి విష యమై ఈనెల 6న దండు యోగాంజనేయలుకు అతని పక్కింటిలో ఉంటున్న నాగార్జున మధ్య గొడవ చోటు చేసుకుంది. దీంతో నాగార్జున , అతని తల్లి సావిత్రమ్మ, భార్య నాగమణిలు దండు యోగాంజనేయులుపై కర్రలతో దాడి చేశారు. దీంతో అతను అక్కడికక్కడే కుప్పకూలిపోయి చనిపోయాడు. ముగ్గురిపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఈ మేరకు ఆర్కే వ్యాలీ సీఐ ఉలసయ్య, ఎస్ఐ టీవీ కిష్టయ్య నిందితుల కోసం గాలింపు చేపట్టి.. వేంపల్లె, రాయచోటి రోడ్డులోని గాలివీడు క్రాస్ వద్ద ఉండగా అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు ఎస్పీ తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

పట్టపగలు ఇంట్లో చోరీ

● 7 తులాల బంగారు అపహరణ

మైదుకూరు రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మైదుకూరు పట్టణంలోని వేదవ్యాస స్కూల్ సమీపంలో సోమవారం మధ్యాహ్నం ఉమ్మడి వెంకటశివ అనంద్ కుమార్ రెడ్డి అనే వ్యక్తి నివాసంలో దొంగతనం జరిగినట్లు పోలీసులు తెలిపారు. వెంటక శివ సొంత గ్రామం ముత్తలూరుపాడులో ఇంటి నిర్మాణ పనులు జరుగుతుండగా భార్యతో కలిసి ఉదయం అక్కడకు వెళ్లాడు. ఇంట్లో ఎవ్వరూ లేని విషయం పసిగట్టిన దొంగలు చోరీకి పాల్పడినట్లు తెలుస్తోందని పోలీసులు తెలిపారు. సుమారు 7 తులాల బంగారం చోరీకి గురైనట్లు తెలిపారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ఫిర్యాదుదారుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

కడప క్రైం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): న్యాయం కోసం పోలీసుస్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఇన్‌చార్జి ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు సిబ్బందిని హెచ్చరించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి సంబంధిత పోలీసుస్టేషన్లకు బదిలీ చేశారు. అలాగే వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుంచి సమస్యల పరిష్కారం కోసం వచ్చే ఫిర్యాదుదారుల సమస్యలను నిర్లక్ష్యం వహించకుండా సత్వరమే విచారణ జరిపి న్యాయం చేయాలని ఆదేశించారు.

ఎస్ఈగా చెన్నకేశవరెడ్డికి పదోన్నతి

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కడప పబ్లిక్ అండ్ హెల్త్ ఈఈగా విధులు నిర్వహిస్తున్న ఎస్.చెన్నకేశవరెడ్డిని తాత్కాలిక పద్ధతిలో సూపరింటెండెంట్ ఇంజనీరుగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. వేతన స్కేలులో తాత్కాలిక ప్రాతిపదికన కాలానుగుణంగా వర్తించే విధంగా ఆదేశాలు జారీ చేశారు.

బోగస్ పింఛన్లపై అధికారుల విచారణ

చాపాడు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీపేట గ్రామ పంచాయతీలోబోగస్ పింఛన్లు ఏరివేసేందుకు అధికారులు సోమవారం ఇంటింటి విచారణ చేశారు. ప్రభుత్వం లక్ష్మీపేట గ్రామ పంచాయతీని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసింది. కడప డీఆర్‌డీఏ పీడీ ఆనంద్‌నాయక్‌కు రాజుపాళెం, ప్రొద్దుటూరు, దువ్వూరు మండలాల ఎంపీడీవోలు సూర్యనారాయణరెడ్డి, రామకృష్ణయ్య, రమణారెడ్డి, ఏఈలు భరత్‌కుమార్‌రెడ్డి, ఈవోపీఆర్‌డీలు ఆలీంఖాన్, రామాంజనేయరెడ్డి, ఏవోలు వీరారెడ్డి, బాలన్న, మరో 12 మంది అధికారులు పది టీంలుగా ఏర్పడి విచారణ చేశారు. ఈ పంచాయతీ పరిధిలో లక్ష్మీపేట, కేతవరం, వీరభద్రాపురం, గ్రామాలు ఉన్నాయి. మొత్తం 400 పింఛన్లు విచారణ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. వీటిలో 380 పింఛన్లపై ఇంటింటికి వెళ్లి విచారణ చేసినట్లు అధికారులు తెలిపారు. మిగిలిన 20 మంది అందుబాటులో లేరన్నారు. మంగళవారం మళ్లీ మిగిలినవారిపై విచారణ చేస్తామన్నారు. ఈ విచారణలో ఈవోపీఆర్‌డీ క్రిష్ణవేణి, ఆగ్రామ కార్యదర్శులు వెంకటనాయుడు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.



విచారణ చేస్తున్న అధికారులు

పెళ్లింట విషాదం

● 6న కుమార్తె వివాహం... 8న తండ్రి మృతి ● ప్రమాదవశాత్తు రైలుకింద పడి..

ఎర్రగుంట్ల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రైల్లో ప్రయాణికులకు భోజనాలు (క్యాటరింగ్) ఇచ్చేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు అదే రైలుకింద పడి కందుకూరి సంజీవకుమార్ (63) మృతి చెందాడు. వివరాల్లోకెళితే.... ఎర్రగుంట్ల మెయిన్ బజార్‌లో సంజీవకుమార్ హోటల్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తెలున్నారు. శుక్రవారం కుమార్తె వివాహం పోరుమామిళ్లలో జరిగింది. కుమార్తె అత్తారింటినుంచి ఇంకా ఇంటికి కూడా రాలేదు. రైళ్లలో వెళ్లే ప్రయాణికులు ఎవరైనా ఫోన్లలో భోజనం కావాలని అడిగితే సంజీవకుమార్ కుటుంబం క్యాటరింగ్ చేస్తోంది. ఆదివారం జయంతి ఎక్స్‌ప్రెస్ నుంచి కొందరు భోజనాలు కావాలని ఫోన్ ద్వారా కోరడంతో తన కుమారుడు లేకపోవడంతో సంజీవకుమార్ భోజనాలు ఇచ్చేందుకు వెళ్లాడు. అయితే రైలులో ఉన్నవారికి భోజనాలు ఇచ్చే సమయంలో ప్రమాదవ శాత్తు ప్లాట్‌ఫారం 1కు రైలుకు మధ్యలో కదులుతున్న రైలుకింద పడిపోయాడు. దీంతో అతనికి ఎడమచేయి, కాలు కట్ కావడంతో తీవ్ర రక్తస్రావం జరిగింది. వెంటనే అతనిని 108లో రైల్వే పోలీసులు ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు. అయితే అతను చికిత్స పొందుతూ మృతి చెందాడు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, మృతుడు సంజీవకుమార్ ఇంట తీవ్ర విషాదం నెలకొంది. 6వ తేదీ శుక్రవారం పోరుమామిళ్లలో కుమార్తె పెళ్లి చేశారు. వారు ఇంకా ఇంటికి రాలేదు. ఆదివారం కుటుంబ మొత్తం తిరుమలకు వెళ్లి వేంక టేశ్వరస్వామిని దర్శించుకుని రావాల్సి ఉందని.. ఈ ప్రమాదం జరగడంతో నవ వధువులు పుట్టెడు దుఃఖంతో రావాల్సి వచ్చిందని బంధువులు తెలిపారు.



ఉరి వేసుకుని వ్యక్తి మృతి

సీకేదిన్నె,డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేరీనగర్‌లో సోమవారం ఉరి వేసుకుని నాగూర్ ప్రవీణ్ (32) అనే వ్యక్తి మృతి చెందినట్లు సీఐ శివశంకర్‌నాయక్ తెలిపారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరివేసుకుని చనిపోయాడన్నారు. మృతుని తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి.. పోస్టుమార్టంకు తరలించినట్లు తెలిపారు. ఖాజీపేట మండలం నాగసానిపల్లెకు చెందిన ప్రవీణ్ జీవనోపాధి కోసం ఇక్కడకు వచ్చి వెల్డింగ్ పనులు చేసుకుని జీవిస్తుండేవాడు. కాగా మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు సంతానం ఉన్నట్లు పోలీసులు తెలిపారు.



గుర్తు తెలియని శవం లభ్యం

మైదుకూరు రూరల్,డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగాయపల్లె గ్రామం వెలుపల ఉన్న జొన్నపుచెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకొన్న పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వయస్సు సుమారు 35 నుంచి 40 మధ్యలో ఉండవచ్చునని, శవం గుర్తించడానికి వీలులేనట్లు తెలిపారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

శ్రీకృష్ణదేవరాయల కాలనీలో చోరీ

● 2 తులాల బంగారం, 2 లక్షల నగదు అపహరణ

కడప క్రైం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కడప నగరం శ్రీకృష్ణదేవరాయల కాలనీలో సోమవారం పట్టపగలే ఓ ఇంట్లో దొంగలు పడి బంగారం, నగదు అపహరించారు. చిన్నచౌకు ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి వివరాల మేరకు.. రామసుబ్బారెడ్డి సొంత పని నిమిత్తం కుటుంబ సభ్యులతో కలిసి కడప నగరానికి వచ్చారు. తిరిగి సాయంత్రం ఇంటికి వెళ్లి చూడగా ఇంటి తాళాలు పగిలిపోయి ఉండడంతో పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు రెండు తులాల బంగారు చైను, రూ.2 లక్షల నగదు చోరీకి గురైనట్లు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఇద్దరి అదృశ్యం

కడప క్రైం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కడప నగరం తిలక్‌నగర్‌కు చెందిన ఓ మహిళ, శాంతినగర్‌కు చెందిన ఓ వ్యక్తి అదృశ్యమైనట్లు రిమ్స్ పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు... తిలక్‌నగర్‌కు చెందిన చంద్రిక కడపలో పనిచేస్తుండేది. ఆదివారం షాపుకు వెళ్తున్నట్లు చెప్పి ఇంటి నుంచి వెళ్లిపోయిందని, తిరిగి ఇంటికి రాకపోవడంతో ఆమె తల్లి రెడ్డెమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు. అలాగే శాంతినగర్‌కు చెందిన దుర్గాప్రసాద్ బేల్దారి పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. హైదరాబాదులో పనిచేస్తూ అప్పుడప్పుడూ ఇంటికి వచ్చివెళ్లేవాడని, అక్టోబరు 10న ఇంటి నుంచి వెళ్లి ఇప్పటివరకు రాలేదని, ఆయన ఫోన్ కూడా స్విచ్ ఆఫ్ వస్తోందని తెలిపారు. భార్య విజయ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

తెలుగు భాషా, సాహిత్య సంపద పరిరక్షణ అందరి బాధ్యత : కలెక్టర్

కడప కల్చరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషా, సాహిత్య సంపదను భావితరాలకు వారసత్వ సంపదగా అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక సీపీ బ్రౌన్ సాహిత్య పరిశోధన గ్రంథాలయాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. తెలుగు భాషా సాహితీ సౌరభంలో మణి దీపంలా వెలుగొందుతున్న బ్రౌన్ పరిశోధనా కేంద్రాన్ని సందర్శించడం తనకు చాలా సంతృప్తినిచ్చిందన్నారు. వైవీయూకు అనుబంధంగా వున్న బ్రౌన్ భాషా పరిశోధనా కేంద్రం విస్తరణాభివృద్ధికి, యూనివర్శిటీ భాషా పరిశోధక యంత్రాంగం చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. అనంతరం ఆదరణ, ఔన్నత్యాన్ని కోల్పోయే స్థితిలో వున్న తెలుగు భాషా సాహిత్యాన్ని, పునర్లిఖించిన ఆంగ్లేయ సాహితీ శిఖరం.. చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ అని.. ఆయన సేవలు తెలుగు భాషా సాహితీవేత్తలకు ఆదర్శనీయం అన్నారు. కార్యక్రమంలో కడప ఆర్డీఓ జాన్ ఇర్విన్, కడప మున్సిపల్ కమిషనర్ మనోజ్‌రెడ్డి, బ్రౌన్ గ్రంథాలయ సలహామండలి సభ్యులు జానమద్ది విజయభాస్కర్, సంచాలకులు పార్వతి, లైబ్రరీ సిబ్బంది పాల్గొన్నారు.

వైవీయూ రెండో దశ అంతర్ కళాశాలల క్రీడా పోటీలు

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు వైవీయూ డాక్టర్ వైఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో వైవీయూ అంతర్ కళాశాలల వాలీబాల్ కబడ్డీ, టగ్‌ఆఫ్ వార్ పురుషులు, మహిళల క్రీడా పోటీలు ఈ నెల 14, 15 తేదీల్లో నిర్వహించనున్నట్లు క్రీడా బోర్డు కార్యదర్శి కె.రామసుబ్బారెడ్డి ప్రకటనలో తెలిపారు. ఈ క్రీడల్లో పాల్గొనే వారు 2024 జూలై 1 నాటికి 17 సంవత్సరాలు పైన 25 సంవత్సరాలు లోపు వయసు కలిగి విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలలో చదువుతుండాలన్నారు. ఈ క్రీడల్లో పాల్గొనేవారు స్టడీ, టెన్త్ మార్క్స్ మెమో, ఇంటర్మీడియట్ మార్క్స్‌మెమో, ఒరిజినల్ జిరాక్స్ పత్రాలు తీసుకుని 14న ఉదయం 8గంటల్లోపు వైఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో హాజరుకావాలని కోరారు. వివరాలకు 9052540530, 9000294626లను సంప్రదించాలన్నారు.

సామాజిక పెన్షన్ లబ్ధిదారుల వివరాలు తనిఖీ

పెనగలూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సామాజిక పింఛన్ లబ్ధిదారుల వివరాలు తనిఖీ చేసేందుకు అన్నమయ్య జిల్లాలోని ఈటమాపురం గ్రామాన్ని ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసుకుంది. అన్నమయ్య జిల్లా డీఆర్డీఏపీడీ సత్యనారాయణ అధ్యక్షతన సోమవారం 12 మజరా గ్రామాల్లో ఇద్దరేసి చొప్పున 12 బృందాలు లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి తనిఖీ చేశాయి. ఈటమాపురం పంచాయతీ పరిధిలో అధికారులు అక స్మాత్తుగా తనిఖీ ప్రారంభించడంతో పనులకు వెళ్లిన పలువురు లబ్ధి దారులు విషయం తెలుసుకుని హడావుడిగా అధికారులను కలిశారు. అత్యవసర పనులపై పొరుగూళ్లకు వెళ్లినవారు కూడా పరుగు పరుగున వచ్చి అధికారుల ఎదుట హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఆర్డీఏ పీడీ సత్యనారాయణ మాట్లాడుతూ లబ్ధిదారుల వివరాలు తనిఖీ చేసి నిర్ధారించే కార్యక్రమానికి ఈటమాపురం గ్రామాన్ని ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టుగా ఎన్నుకుందన్నారు. పెనగలూరు ఎంపీడీవో ఎస్.విజయరావు, డీఎల్‌డీవో నరసింహమూర్తి, పెన్నన్ల ఏపీడీ ధర్మరాజు, ఐకేపీ ఎంపీఎం నిరంజన్‌కుమార్, చిట్వేలి, రాజంపేట ఎంఈవోలు శంకరయ్య, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

'మదనపల్లి తహసీల్దార్‌ను సస్పెండ్ చేయండి'

రాయచోటి కలెక్టరేట్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికి లంచం డిమాండ్ చేయడంతో గొంతు కోసుకుని నిర సన వ్యక్తం చేసిన మాజీ సైనికుడి భూ సమస్య పరిష్కరించాలని, అవినీతికి పాల్పడుతున్న మదనపల్లి తహసీల్దార్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలని జిల్లా సీపీఐ కార్యదర్శి పీఎల్ నరసింహులు, వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి తోపు కృష్ణప్ప, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద ఆయా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పది రోజులుగా మదనపల్లి తహసీల్దార్ అవినీతిపై పత్రికల్లో వార్తలు వస్తున్నా, తన భూమిని మ్యుటేషన్ చేయడానికి లక్ష రూపాయలు తహసీల్దార్ లంచం అడిగిందని మాజీ ఎమ్మెల్సీ ఆరోపణలు చేసినా, ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని వారు ఆరోపించారు. సోమవారం తహసీల్దార్ వైఖరిని నిరసిస్తూ మాజీసైనికుడు గొంతు కోసుకున్నాడన్నారు. ఇప్పటికైనా ఆ తహసీల్దార్‌పై శాఖాపరమైన చర్యలు తీసు కోవాలని వారు డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సిద్దిగాళ్ల శ్రీనివాసులు, విశ్వనాథ్‌నాయక్, కోటేశ్వరరావు, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి, మాధవ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధితో రైతులకు జీవనోపాధి



చెన్నకేశవులు, ఏపీవో, కలకడ

ముఖాముఖి

కలకడ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం రైతులకు జీవనోపాధి కల్పిస్తుందని ఏపీవో చెన్నకేశవులు పేర్కొన్నారు. ఉపాధి ద్వారా అందుతున్న పథకాలు, వివిధ రకాల ప్రజలకు చేకూరుతున్న లబ్ధి, కూలీలకు జాబ్‌కార్డులు మంజూరు, సౌకర్యాలపై ఏపీవో చెన్నకేశవులు సోమవారం ఇంటర్వ్యూలో వివరాలను వెల్లడించారు.

ప్రశ్న: ఉపాధి పథకంలో రైతులకు ఎలాంటి పథకాలు అమలవుతున్నాయి..?

జవాబు: రైతులకు పండ్లతోటల పెంపకంలో భాగంగా మామిడి, దానిమ్మ, కొబ్బరి, అల్లనేరుడు పనులు కల్పిస్తున్నాం

ప్రశ్న: లబ్ధిపొందేందుకు అర్హులు ఎవరు..?

జవాబు: ఐదెకరాలలోపు భూములున్న సన్న, చిన్నకారు రైతులు అర్హులు. కాగా ఇందులో ఎస్సీ, ఎస్టీ వర్గాల రైతులకు ప్రాధాన్యతనిస్తున్నాం.

ప్రశ్న: :పథకం వలన పాడి రైతులు లబ్ధిపొందే అవకాశముందా..?

జవాబు: ఉంది, గోకులాలు, మినీ గోకులాలు, గొర్రెలు, మేకల షెడ్లు, పశుగ్రాసం సాగుకు పథకం ద్వారా నిధులు మంజూరు చేయడం జరుగుతుంది.

ప్రశ్న: గ్రామాల్లో పారిశుధ్యానికి సంబంధించి పనులు ఉన్నాయా...?

జవాబు: గ్రామాల్లో ఇళ్ల వద్ద ఇంకుడు గుంతలు, కమ్యూనిటీ ఇంకుడు గుంతల నిర్మాణం, సీసీ రోడ్ల పనులు జరుగుతున్నాయి.

ప్రశ్న: జాబ్ కార్డు పొందడానికి అర్హత ఏమిటి?

జవాబు: ఓ కుటుంబంలోని వయస్సు 18 ఏళ్ల పైబడిన సభ్యులందరికి నైపుణ్యం లేని పనులు చేయడానికి జాబ్ కార్డులు మంజూరు చేస్తారు. వీరిలో ఉద్యోగులుంటే జాబ్ కార్డు పొందడానికి అనర్హులు.

ప్రశ్న: :పనుల వద్ద కూలీలకు ఎలాంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు...?

జవాబు: పనులు చేసే కూలీలకు ప్రథమ చికిత్స కిట్, తాగునీరు అందుబాటులో ఉంచుతున్నాం. అలాగే వర్షా కాలంలో తడవకుండా, వేసవిలో నీడకు పనికొచ్చే టార్పలిన్ పట్టలు గతంలో పంపిణీ చేసినవి పాడైనవి. వాటి స్థానంలో కొత్తవి కావాలని ప్రభుత్వానికి నివేదిక పంపాం.

ప్రశ్న: స్కిల్ డెవలప్‌మెంట్ పరంగా యువతకు శిక్షణా కార్యక్రమాలున్నాయా...?

జవాబు: ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డు కలిగి కూలీలుగా పని చేస్తున్న కుటుంబంలోని వయస్సు 18 ఏళ్ల పైబడి 35 ఏళ్లలోపు ఉన్నవారు నైపుణ్య శిక్షణ పొందేందుకు అర్హులు. వారికి ఉన్నతి పథకం ద్వారా వివిధ రంగాల్లో ప్రభుత్వం శిక్షణ ఇప్పిస్తుంది.

విగ్రహం ఏర్పాటుకు వినతి

రామసముద్రం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వడ్డెర ఓబన్న విగ్రహం ఏర్పాటుకు స్థలం చూపాలని కోరుతూ సోమవారం వడ్డెర సంఘం అధ్యక్షుడు రెడ్డెప్ప, జిల్లా నేత వాలెప్ప తహసీల్దార్ నిర్మలాదేవికి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వడ్డెరల కోసం ఓబన్న ఎంతో కృషి చేశారని వడ్డెరల జ్ఞాపకార్థం ఆయన విగ్రహం ఏర్పాటుకు స్థలం చూపాలన్నారు.

చిలగడ దుంపల సాగుపై ఆసక్తి

● సేంద్రియ ఎరువులు, డ్రిప్ పద్ధతిలో సాగు చేస్తున్న రైతన్నలు ● కరువు ప్రాంతంలో వనరుల వినియోగం ● తక్కువ ఖర్చు అధిక ఆదాయం



సాగు చేసిన చిలగడ దుంపల పంట



చిలగడ దుంపలు

కలకడ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి):ఖరీప్-రబీ మధ్యస్థ సీజన్‌లో పండించే చిలగడ దుంపల(గెన్సీ గడ్డల)సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. కరువు ప్రాంతంలోని మెట్టభూములో ఉన్న నీటి వనరులను సద్వినియోగం చేసుకుంటూ ఫలితం అందుకుంటున్నారు. అనవాయితీగా కలకడ మండలం సింగనొడ్డుపల్లె, గుడిబండ, తెట్టు, తిప్పిగారిపల్లె, మండెంవారిపల్లె గ్రామాల రైతులు ఏటా దాదాపు 200 ఎకరాల్లో ఈ పంటను సాగుచేస్తున్నారు. అదే విధంగా గుర్రంకొండ, కలికిరి, లక్కిరెడ్డిపల్లె మండలాల్లో కూడా పంట సాగు చేస్తున్నట్లు వ్యాపారులు తెలిపారు. విత్తనంగా తీగలను ముందుగానే సిద్ధం చేసుకుని సాగు చేస్తున్నారు. దుక్కుల నుంచి సేంద్రియ ఎరువులు, కూలీలు పంట నూర్పిడికి ఎకరానికి సుమారు రూ.40 వేలు పెట్టుబడి అవుతుందని రైతులు చెబుతున్నారు. అలాగే ఉన్న నీటి వనరులను పొదుపుగా వాడుకొనేందుకు డ్రిప్ పద్ధతిని అనుసరిస్తున్నారు. దేవుడు కరుణిస్తే ఎకరానికి 6 నుంచి 9 టన్నుల వరకు దిగుబడి వస్తుందని గతేడాది వాటి ధర టన్ను రూ.20 వేల నుంచి 25 వేలకు అమ్ముడుపోయినట్లు తెలిపారు.

మార్కెటింగ్ అవకాశాలు

రైతులు పండించిన సరుకును వ్యాపారులు పొలం వద్దే కొనుగోలు చేస్తారు. మొదటి విడతగా జనవరిలో వచ్చే సరుకును వారు కొనుగోలు చేసి చెన్నై, హైదరాబాదు, విజయవాడ తదితర మార్కెట్‌లకు తరలిస్తారు. అదే విధంగా రెండవ విడతగా మార్చి, ఫిబ్రవరిలో వచ్చే సరుకును డిల్లీ, కలకత్తా, ఉత్తరాది రాష్ట్రాలకు తరలిస్తారు.

సంక్రాంతి, మహాశివరాత్రికి భలే గిరాకీ

దక్షిణాది రాష్ట్రాల్లో సంక్రాంతి పండుగకు ఉత్తరాది రాష్ట్రాల్లో మహాశివరాత్రికి ప్రజలు వంటకాలకు గెన్సీ గడ్డలను విరివిగా ఉపయోగిస్తారు. అందువలన ఆ సమయంలో వాటికి గిరాకీ ఎక్కువగా ఉంటుందని మార్కెట్‌లో సరుకు బాగా అమ్ముడుపోతుందని వ్యాపారులు తెలుపుతున్నారు.

నికర ఆదాయం...

రైతులమైన మాకు గెన్సీ గడ్డల సాగులో నికర ఆదాయం వస్తుంది. ఎన్నో ఏళ్లగా ఈ సేద్యం చేస్తున్నాం. అసలుకు డోకా లేదు కానీ నష్టాలు వచ్చిన దాఖలాలు లేవు.

-ఆవుల సూరి, రైతు, కోటగుడిబండ, కలకడ మండలం

ఐదెకరాల్లో సాగు చేశా..

ఈ ఏడాది ఐదెకరాల్లో గెన్సీ గడ్డల పంట సాగు చేశా. మాది కరువు ప్రాంతం ఇతర పంటలు సాగు చేస్తే ఫలితం వస్తుందని గ్యారెంటీ లేదు. అందుకు తక్కువ ఖర్చుతో సాగై పంటలపై దృష్టి సారించాం. ఇందుకు గానూ ఎక్కువ విస్తీర్ణంలో తక్కువ పెట్టుబడి పంటగా గెన్సీ గడ్డల పంటను సాగు చేస్తున్నాం. పంట సాగులో లాభాలను గడిస్తున్నాం.

-రెడ్డిశేఖర్, తెట్టు గ్రామం, కలకడ, మండలం

మండలమీట్ అనుమతికి ఎంపీపీ నిరాకరణ

బి.కొత్తకోట, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండలమీట్ నిర్వహణ తేదీ కోసం ఉత్తర్వులు ఇవ్వడానికి ఎంపీపీ నిరాకరించారు. వివరాలిలా వున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో ఎంపీపీగా లక్ష్మీనరసమ్మ ఎంపికయ్యారు. కాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సెలెక్టెడ్ ఎంపీటీసీలు మండలమీట్‌కు రాకూడదని కూటమి నాయకులు రెండుసార్లు మండలమీట్‌ను అడ్డుకున్నారు. అయితే 90రోజుల లోగా సమావేశాన్ని నిర్వహించవలసిన బాధ్యత ఉన్నందున ఎంపీడీవో మండల మీట్‌ను నిబంధనల మేరకు ఈ నెల19న నిర్వహించాలని అనుకున్నారు. ఏడు రోజుల ముందే మండల సమాచారం ఇవ్వాల్సి ఉన్నందున సమావేశ నిర్వహణ అనుమతుల కోసం ఎంపీపీ లక్ష్మీనరసమ్మ వద్దకు ఈనెల 5 నుంచి మూడుసార్లు సర్క్యులర్ పంపినా అనుమతి ఇవ్వడానికి ఆమె నిరాకరించినట్లు తెలుస్తోంది. ప్రత్యేక పరిస్థితులలో ఎంపీపీ అనుమతి లేకుండానే మండలమీట్ ను నిర్వహించే అధికారం ఎంపీడీవోకు ఉంది. ఇలా నిర్వహించిన మూడవ సమావేశం కూడా కోరంలేక వాయిదా పడితే మండలప్రజాపరిషత్ పాలకమండలి రద్దయ్యే అవకాశం లేకపోలేదు. దీంతో వైసీపీ ఎంపీటీసీలు మండల మీట్‌కు వస్తారా? వస్తే కూటమి నాయకులు రానిస్తారా? ఇది ఎక్కడికి దారితీస్తుందో వేచిచూడాల్సిందే.

భూ సమస్యల పరిష్కారానికే రైతు సదస్సులు

పెద్దమండ్యం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి) భూ సమస్యలు పరిష్కారం కోసమే ప్రభుత్వం రైతు సదస్సులు నిర్వహిస్తున్నట్లు పెద్దమండ్యం నోడల్ అధికారి, జిల్లా హౌసింగ్ పీడీ సాంబశివ పేర్కొన్నారు. మండలం లోని వెలిగల్లు లో శుక్రవారం జరిగిన రైతు సదస్సులో రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. ఇందులో 77 అర్జీలు వచ్చాయి. ఆన్‌లైన్, భూసర్వే, దారి సమస్యలు, రేషన్‌కార్డుల తదితర సమస్యలపై అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. తహసీల్దార్ సయ్యద్ ఆప్జాద్, సర్పంచ్ బయ్యారెడ్డి, ఆర్ఐ రమేష్, మండల సర్వేయర్ హసీన్‌తాజ్, వీఆర్‌వో జయరాం, కూటమి నేతలు జిల్లా టీడీపీ మాజీ ఉపాధ్యక్షుడు విశ్వనాథరెడ్డి, కాలేషా, ఇస్మాయిల్ (చింటు), సాంబ, సుబ్బరామిరెడ్డి, జీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శిశువులు, గర్భిణులకు మెరుగైన వైద్యం అందించాలి

వాల్మీకిపురం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాస్పత్రులకు వచ్చే గర్భిణులు, శిశువులకు మెరుగైన వైద్యం అందించాలని కేర్ క్యాంపెనింగ్ జిల్లా ప్రోగ్రామం ఆఫీసర్ డాక్టర్ సంధ్య పేర్కొన్నారు. సోమవారం ఆమె వాల్మీకిపురం ప్రభుత్వాస్పత్రిలో సీసీపీని సందర్శించారు. ఈసందర్భంగా స్థానిక వైద్యులు, సిబ్బందితో సమావేశమై ఆస్పత్రిలో గర్భవతులు, బాలింతలు,శిశువుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. మాతా శిశు మరణాలు పూర్తిగా లేకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఫైరోజాబేగం, డాక్టర్లు రవికుమార్, సోని, శివాని హర్షితరెడ్డి, జ్ఞానేశ్వర్, మమత, ఆసిఫ్, హిమబిందు పాల్గొన్నారు.

టి.సదుం మాజీ మహిళా సర్పంచ్ విమలారెడ్డి మృతి

పెద్దతిప్పసముద్రం డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో మండలంలోని టి.సదుం పంచాయతీ మాజీ సర్పంచ్ విమలారెడ్డి (95) సోమవారం బెంగళూరులోని స్వగృహంలో మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. ఈమె టి.సదుం పంచాయతీకి 1995లో టీడీపీ నుంచి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విమలారెడ్డి భర్త పీఎస్ రామక్రిష్ణారెడ్డి తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీలో క్రియాశీలకంగా పని చేశారు. విమలారెడ్డి మృతితో టి.సదుం గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. విమలారెడ్డికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. వారు కర్ణాటక రాష్ట్రంలో అత్యున్నత హోదాల్లో పని చేస్తున్నారు. వారికి టి.సదుం పంచాయతీ చెన్నరాయునిపల్లెలో ఆస్తులు ఉన్నప్పటికి కుమార్తెలు కర్ణాటక రాష్ట్రంలోని వివిధ అత్యున్నత హోదాల్లో పని చేస్తున్నందున బెంగళూరులో స్థిరపడ్డారు. ఆమె మృతికి తంబళ్లపల్లె నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే ఏవీ లక్ష్మీదేవమ్మ సంతాపం తెలిపారు. ములకలచెరువు మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ శ్రీనాథ్‌రెడ్డి కూడా ఆమె మృతికి సంతాపం తెలిపారు.

అదానితో కుదుర్చుకున్న విద్యుత్ ఒప్పందాలు రద్దు చేయాలి

ములకలచెరువు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం అదానితో కుదుర్చుకున్న విద్యుత్ ఒప్పందాలు రద్దు చేయాలని సీపీఐ మండల ప్రధాన కార్యదర్శి అంజనప్ప డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం సీపీఐ నాయకులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా అంజనప్ప మాట్లాడుతూ గత ప్రభుత్వం అదానీ విద్యుత్ కంపెనీతో 25 సంవత్సరాలు ఒప్పందం కుదుర్చుకోవడంతోనే విద్యుత్ యూజర్ చార్జీలు పెరిగాయన్నారు. స్మార్ట్ మీటరు అమర్చే విధానం రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఉత్తన్న, రెడ్డెప్ప, సుబ్బన్న, మల్లికార్జున, రమణ తదితరులు పాల్గొన్నారు.

విద్యాహక్కు చట్టం ఉందా? లేదా?

బి.కొత్తకోట, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): విద్యాహక్కు చట్టం అమలులో ఉందా? లేక రద్దు అయిందా? అనే విషయమై స్పష్టత ఇవ్వాలని బి.కొత్తకోట పట్టణానికి చెందిన బాస్ నాయకులు ఎంఈవో రెడ్డిశేఖర్ ను కోరారు. సోమవారం వారు ఎమ్మార్సీ కార్యాలయంలో మాట్లాడుతూ ఆర్‌టీఈ ఎస్ఈ 2023-24 ప్రకారం అన్ని ప్రైవేటు అన్ఎయిడెడ్ పాఠశాలల్లో ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం 2009 సెక్షన్, జీవో ఎంఎస్ నంబర్129, 24 మేరకు ఎంపిక చేసిన విద్యార్థులకు ఎటువంటి ఫీజులు వసూలు చేయరాదని, అయితే బి.కొత్తకోటలో కొన్ని ప్రైవేటు పాఠశాలలో విద్యార్థులను ఫీజులు చెల్లించలేదన్న కారణంగా ఇబ్బందులు పెడుతున్నారన్నారు. దీనిపై విచారించి తగు చర్యలు తీసుకోవాలని ఎంఈవోను కోరారు. కార్యక్రమంలో పి.వెంకటేష్, మహేష్, మాధవ, సచిన్ తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌లో రెవెన్యూ సమస్యలే అధికం



సబ్‌కలెక్టరేట్‌లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె టౌన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్(గ్రీవెన్స్‌డే)లో రెవెన్యూ సమస్యలే అధికంగా వచ్చాయి. స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ ఆధ్వర్యంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం 117 మంది అర్జీలు ఇవ్వగా అందులో 80శాతం రెవెన్యూ అంశాలపై అర్జీలు రావడం గమనార్హం. ఈ సందర్భంగా ప్రతి అర్జీదారుడిని వివరాలు అడిగి, ఆయా మండలాల తహసీల్దార్‌లు, ప్రభుత్వశాఖల అధికారులు పరిష్కరానికి కృషి చేయాలని సబ్‌కలెక్టర్ ఆదేశించారు. కాగా హౌసింగ్, పింఛన్ల కోసం, రేషన్‌కార్డుల్లో మార్పులు చేర్పుల కోసం ప్రజలు అర్జీలు అందజేశారు. నిర్దేశిత సమయంలో పీజీఆర్ఎస్ అర్జీలపై పరిష్కారం చూపాలని సబ్‌కలెక్టర్ సూచించారు.

డివిజన్‌లో 102 చౌకదుకాణాలకు నోటిఫికేషన్

మదనపల్లె టౌన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లోని 11 మండలాల్లో 102 చౌకదుకాణాలకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ డివిజన్‌లో 445 చౌకదుకాణాలు ఉండగా, 1,90,814 రేషన్ కార్డులు ఉన్నాయన్నారు. వాటిలో ఎక్కువ కార్డులు ఉన్న 45 చౌకదుకాణాలను విభజిస్తున్నామన్నారు. దీంతో పాటు తాత్కాలిక డీలర్లు ఉన్న 57 షాపులకు కొత్త డీలర్లను నియమించేందుకు నోటిఫికేషన్ జారీ చేశామన్నారు. 102 చౌకదుకాణాల కేటాయింపునకు ఆసక్తి, అర్హత గల వారు 15వ తేదీ సాయంత్రం 5గంటల లోపు ఆయా తహసీల్దార్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 22వ తేదీన రాత పరీక్ష, 26, 27 తేదీల్లో ఇంటర్వ్యూలు నిర్వహించి డీలర్లను ఎంపిక చేస్తామని చెప్పారు. పూర్తి వివరాలకు ఆయా తహసీల్దార్ కార్యాలయాల్లో నోటీసుబోర్డులో వివరాలను తెలుసుకోవాలని కోరారు.

సర్వజన బోధనాస్పత్రి నుంచి రెఫరల్ తగ్గించాలి



జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందిస్తున్న 108 వాహన డ్రైవర్లు

మదనపల్లె అర్బన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి):స్థానిక ప్రభుత్వ సర్వజన బోధనాస్పత్రి నుంచి రెఫరల్ తగ్గించాలని 108 మదనపల్లె డివిజన్ డ్రైవర్లు కోరారు. సోమవారం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గాయిత్రికి వారు వినతిపత్రం అందజేశారు. ఆస్పత్రిలో పని చేస్తున్న స్టాఫ్ నర్సులే తిరుపతికి రెఫర్ చేస్తున్నారని గతపదిరోజులలోనే 35 కేసులు తిరుపతికి రెఫర్ చేసినట్లు వారు ఆరోపించారు. మదనపల్లె నుంచి తిరుపతికి వెళ్లిరావాలంటే 250 కిలోమీటర్లు 7 గంటల సమయం పడుతుందని ఈ సమయంలో మండలంలో ఎక్కడైనా ప్రమాదం జరిగితే మరో మండలం నుంచి 108 వచ్చేలోపే మృత్యువాత పడుతున్నారన్నారు. చిన్నచిన్న జబ్బులకు రెఫర్ చేయడం తమకు ఇబ్బందిగా ఉందని వారు వాపోయారు. ఇందులో 108 సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న రీసోర్సుపర్సన్ శరవణముత్తు

కురబలకోట, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలని, దీంతో ఉపాధి అవకాశాలను సులభంగా పొందవచ్చని రీసోర్సుపర్సన్ గేట్‌వే సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు సీఈవో శరవణ ముత్తు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో సైబర్ సెక్యూరిటీ విభాగం ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీలో ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ ప్రభావంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా టెక్నాలజీ పెరుగుతుందని, అంతేకాకుండా వ్యక్తిగత డేటాతో పాటుగా పలురకాల సంస్థల డేటాలు సైబర్ చోరీలకు గురవుతున్నాయని, దీనిని పరిరక్షించడానికి సైబర్ సెక్యూరిటీపై దృష్టి సారించి పట్టు సాధించాలన్నారు కార్యక్రమంలో విభాగాధిపతి గంగాదేవీ, ముత్తురసు, కనిష్క తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ షెడ్డును కాపాడాలి



తహసీల్దారుకు వినతి పత్రమిస్తున్న బోడుమల్లువారిపల్లె గ్రామస్థులు

పీలేరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్ ద్వారా గొర్రెలు, మేకల పెంపకం కోసం నిర్మించిన షెడ్డు ఆక్రమణను అడ్డుకోవాలని పీలేరు మండలం బోడుమల్లువారిపల్లె దళితవాడ ప్రజలు తహసీల్దారు భీమేశ్వర రావుకు వినతి పత్రం ద్వారా విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లడుతూ దళితుల ఆర్థికాభివృద్ధి కోసం 1985లో అప్పటి టీడీపీ ప్రభుత్వం సర్వే నెం.819/6బీ1లో ప్రైవేటు వ్యక్తుల భూమిని స్థల సేకరణ జరిపి గొర్రెలు, మేకల పెంపకం కోసం షెడ్డు నిర్మించిందన్నారు. అయితే ప్రస్తుతం ఆ భూమికి చెందిన వారసులు ఆ షెడ్డు తమదేనని, దానిని తొలగించి, ఆ స్థలాన్ని అమ్ముకునేందుకు ప్రయత్నిస్తున్నారని వారు తెలిపారు. తమ గ్రామంలోని అనేక మంది తమ గొర్రెలు, మేకలను ఆ షెడ్డులో తోలుకుని జీవనాధారం పొందుతున్నారని, షెడ్డు లేకపోతే ఇబ్బంది పడాల్సి ఉంటుందన్నారు. రెవెన్యూ అధికారులు షెడ్డు అన్యాక్రాంతం కాకుండా చూడాలని వారు విజ్ఞప్తి చేశారు. తమ సిబ్బంది ద్వారా క్షేత్రస్థాయిలో విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని తహసీల్దారు భీమేశ్వర రావు వారికి తెలియజేశారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం : ఎమ్మెల్యే



టీడీపీ నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మదనపల్లె నియోజకవర్గ అభివృద్ధి, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా తాను పనిచేస్తున్నానని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. సోమవారం ఎమ్మెల్యే నివాసం వద్ద మూడు మండలాలకు చెందిన టీడీపీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆరు నెలలుగా నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమం, కార్యకర్తల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నానన్నారు. ట్రాఫిక్ సమస్య పరిష్కరించేందుకే సీటీఎం రోడ్డులో చింతచెట్లను తొలగించామన్నారు. బర్మావీధి నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు బ్రిడ్జి నిర్మాణం కోసం రూ.12కోట్లతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపామన్నారు. నియోజకవర్గంలో టీడీపీ సభ్యత్వ నమోదు మరింత వేగం పెంచాల్సిన అవసరం వుందన్నారు. సమావేశంలో టౌన్‌బ్యాంకు చైర్మన్ విద్యాసాగర్, వాల్మీకి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ ఎం.ప్రభాకర్, ఎస్ఏ మస్తాన్, ఆర్‌జే వెంకటేశ్, ఎం. నాగయ్య, జనసేన నాయకులు శ్రీరామ రామాంజినేయులు, దారం అనిత, బీజేపీ నాయకుడు ఓసూరి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తల సంక్షేమానికి పెద్దపీట



సభ్యత్వ నమోదును చేపట్టిన టీడీపీ నేత త్యాగరాజు

ములకలచెరువు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యకర్తల సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పెద్దపీట వేస్తున్నారని పార్టీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కేవీ రమణ పేర్కొన్నారు. ములకలచెరువులో సోమవారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 16వతేదీ లోగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజంపేట పార్లమెంటు మహిళా కార్యదర్శి గంగాదేవి, నాయకులు గోపాల్‌రాజు, ఎర్రంరెడ్డి, నాగరాజు, గోవిందరాజు, వెంకటరమణ, రవీంద్ర, శ్రీనివాసులు, శంకర, మారెప్ప తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించండి



ఎస్ఐ నరసింహుడును సన్మానిస్తున్న టీడీపీ అధ్యక్షుడు పాలగిరి సిద్ధా

ములకలచెరువు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలని ఎస్ఐ నరసింహుడు సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో సోమవారం నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్ఐని టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా, నాయకులు, కార్యకర్తలు కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు చెన్నకిష్టా, నాయకులు నారాయణ, కక్కుల సుదర్శన్, నాగమల్లప్ప, భాస్కర్‌నాయుడు, సుధాకర్ నాయుడు, శివన్న, సుబ్బినాయుడు, నాగేంద్ర, బసివి చంద్ర, శంకర, ఉమాశంకర్, ప్రతాప్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

చింతలకుంట రికార్డుల పరిశీలన

నిమ్మనపల్లి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంగంవారిపల్లి పంచాయతి చింతలకుంట సర్వేనెంబరు 63లో గల 2.99సెంట్ల భూమి రికార్డులను తహసీల్దార్ ధనంజేయులు సోమవారం పరిశీలించారు. 'ఆంధ్రజ్యోతి'లో ఈ నెల 5వతేదీన 'చింతలకుంట మాయం' అనే కథనానికి స్పందించిన తహసీల్దార్ ధనంజేయులు సబ్ కలెక్టర్ కార్యాలయం నుంచి రికార్డును తెప్పించి పరిశీలించినట్లు తెలిపారు. గతంలో కొండ పోరంబోగిగా ఉండేదని దానిని 2-2-1920లోనే మార్చి ఇడుపుల చెన్నకేశవుల శెట్టి, శాపరం రామలింగయ్యశెట్టి, గోపాలక్రిష్ణ గుప్తా పేర్లపై ఇచ్చినట్లు తెలిపారు. ప్రస్తుతం రికార్డుల ప్రకారం బి 882-డి-20-85-20, తేది 2-2- 1920 సంవత్సరంలోనే ఆర్ఓఆర్1 మరియు 1బీ ఇచ్చినట్లు తెలిపారు. అప్పటి నుంచి రికార్డులలో మార్పు చేయలేదని తెపారు. ఈ భూమిపై స్థానిక రైతు చంద్రారెడ్డి కోర్టుకు వెళ్లినట్లు తెలిపారు. చింతలకుంట మాయం అనే వార్తపై స్పందిచిన ఆయన పూర్తి వివరాలను అన్నమయ్య జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపినట్లు తెలిపారు.


పోలీస్‌లేన్‌లో నీటి సమస్య పరిష్కారానికి కొత్తబోరు



కలికిరి పోలీస్ లైను వద్ద కొత్త బోరుకు పూజలు చేస్తున్న అధికారులు, నేతలు

కలికిరి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పోలీస్ లేన్, ఎస్‌బీఐ లేన్ ఏరియాల్లో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారం కోసం కొత్త బోరు వేస్తున్నట్లు మేజర్ పంచాయతీ కార్యదర్శి జి. అశోక్ తెలిపారు. బోరు పనులకు సోమవారం ఆయన పూజలు నిర్వహించి ప్రారంభించారు. 15 ఆర్థిక సంఘం నిధులతో విజిబుల్ అసెట్స్ పథకం కింద ఈ కొత్త బోరును ఏర్పాటు చేస్తున్నట్లు అశోక్ తెలిపారు. సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు బోరు వేసి మోటారు అమర్చేందుకు నిధులు మంజూరు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచు ఎల్లయ్య, టీడీపీ నాయకులు రెడ్డివారి యోగేష్ రెడ్డి, రెడ్డెప్ప రెడ్డి, ఉత్తన్న, సుధాకర్ రెడ్డి, ఎంపీడీవో భానుమూర్తి రావు, ఈవోఆర్డీ మహ్మద్ రియాజుద్దీన్‌లు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా నూతన వీఆర్వోల సంఘం ఏర్పాటు



సురేష్‌కుమార్ రెడ్డి అధ్యక్షుడు



ప్రసాద్ రెడ్డి ఉపాధ్యక్షుడు

కలికిరి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కలికిరి మండల వీఆర్వోల సంఘం నూతన కార్యవర్గాన్ని ఏక గ్రీవంగా ఎన్నుకొన్నారు. సోమవారం జరిగిన వీఆర్వోల సమావేశంలో కార్యవర్గాన్ని ఎన్నుకొన్నారు. మండల వీఆర్వోల సంఘం అధ్యక్షుడుగా మర్రికుంటపల్లె వీఆర్వో ఎస్.సురేష్‌కుమార్ రెడ్డి, ఉపాధ్యక్షుడుగా కలికిరి వీఆర్వో టి.ప్రసాద్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా చీకటిపల్లె వీఆర్వో నరేష్‌కుమార్, సంయుక్త కార్యదర్శిగా టి.శిల్పకుమారి, కోశాధికారులుగా బి.గౌరి, జె.శ్రీనివాసులు ఎన్నికయ్యారు. అనంతరం ఏకగ్రీవ కార్యవర్గం జాబితాను తహసీల్దారు మహేశ్వరీబాయికి అందజేశారు. ఎన్నికైన నూతన కార్యవర్గాన్ని ఆమె అభినందిస్తూ శుభాకాంక్షలు చెప్పారు. వీఆర్వో సమస్యల పరిష్కా రానికి సహకరించాలని సంఘం నాయకులు తహసీల్దారును కోరారు.

అడవి జంతువు దాడిలో మేక మృతి

మదనపల్లె టౌన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం ఆవులపల్లె గ్రామ శివారులో ఆదివారం రాత్రి అడవిజంతువు దాడిలో ఓ రైతుకు చెందిన మేక మృతి చెందింది. ఆవులపల్లెకు చెందిన రైతు వెంకటస్వామి మేకల మందను గ్రామ శివారులో కట్టేశాడు. రాత్రి పొద్దుపోయాక మేకల మందలో అలజడి, శబ్దాలు వినిపించాయి. దీంతో రైతు అక్కడికి వెళ్లి చూడగా ఒక మేక గొంతు వద్ద తీవ్ర రక్తస్రావమై మృతి చెంది ఉండటాన్ని గమనించి విషయాన్ని అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చాడు. దీంతో ఎఫ్ఆర్‌వో ప్రసాదరావు ఆదేశాల మేరకు డీఆర్‌వో మదనమోహన్ సంఘటన స్థలానికి వెళ్లి మేక కళేబరాన్ని పరిశీలించారు. సంఘటనా స్థలంలో ఏవిధమైన ఆనవాళ్లు లేవని మృతి చెందిన మేకను గ్రామస్థులు కోసుకుని తినేశారన్నారు. కాగా జంతువు దాడిలో మృతి చెందిన మేకను తింటే వైరస్ సోకే అవకాశం ఉందని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని డీఆర్‌వో గ్రామస్థులకు సూచించారు.

ఘనంగా సోనియాగాంధీ జన్మదిన వేడుకలు

మదనపల్లె అర్బన్,డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ నాయకురాలు సోనియాగాంధీ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని ఆ పార్టీ సీనియర్ నాయకుడు సింగం రామకృష్ణారెడ్డి స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో కాంగ్రెస్ పార్టీ ప్రజాదరణ పొందిందని ఏపీలో కూడా షర్మిలా నాయకత్వంలో పార్టీ బలోపేతం కానున్నదన్నారు. నాయకులు రమేషన పవన్‌కుమార్‌రెడ్డి, ఈశ్వర్, సుధాకర్, నాగునాయక్ పాల్గొన్నారు.

సీటీఎం జడ్పీ స్కూల్‌లో ఐఎఫ్‌పీ ప్యానెల్ ధ్వంసం

మదనపల్లె అర్బన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): సీటీఎం జడ్పీ హైస్కూల్‌లో ఐఎఫ్‌పీ ప్యానెల్‌ను దుండగులు ధ్వంసం చేశారు. గమనించిన పాఠశాల ఉపాధ్యాయులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సోమవారం తాలుకా ఎస్ఐ చంద్రమోహన్ సీటీఎం స్కూల్‌లో విచారణ చేపట్టారు. హెచ్ఎం ఫిర్యాదు మేరకు తాలుకా ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.